

ప్రధాన మోదీ, సీఎం చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కూటమి నాయకులు

కూటమి నేతల సంబరాలు

మదనపల్లె టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా చేస్తామని చంద్రబాబు, నారా లోకేశ్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు తెలిపారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద శ్రీరామ్‌చినబాబు ఆధ్వర్యంలో బీజేపీ సీనియర్ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, జనసేన నేత దారం అనిత, సీడ్ మల్లికార్జుననాయుడు సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. శ్రీరామ్‌చినబాబు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో సెకండ్ సీఎంగా చెప్పుకున్న పెద్దిరెడ్డి కుటుంబం మదనపల్లెను జిల్లా చేయకుండా ఇక్కడి ప్రజలను మోసం చేశారన్నారు. చంద్రబాబు, నారా లోకేశ్ ఇచ్చిన మాట ప్రకారం మదనపల్లెను జిల్లా చేస్తున్నారన్నారు. ఇలాంటి సందర్భంలో ఎంపీ మిధున్‌రెడ్డి ఏ ముఖం పెట్టుకుని గురువారం మదనపల్లెకు వస్తున్నారని ప్రశ్నించారు. మదనపల్లె ప్రజలకు క్షమాపణ చెప్పాకే మిధున్‌రెడ్డి మదనపల్లెలో పర్యటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్లంపల్లె ప్రశాంత్, పఠాన్ ఖాదర్ ఖాన్, బండి ఆనంద్, దొరస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాక్ అసెంబ్లీ



చక్రంపేట ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మాక్ అసెంబ్లీ

పెనగలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం చక్రంపేట ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు లేబాక గోపాలకృష్ణ అధ్యక్షతన విద్యార్థులతో మాక్ అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భారత రాజ్యాంగం పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువలు కాపాడడంపై విద్యార్థులు మాట్లాడిన తీరు ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

వీరభద్రాలయంలో సుబ్రహ్మణ్య షష్టి పూజలు


రాయచోటిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో వెలిసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో బుధవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి సందర్భంగా షణ్ముఖేశ్వరుని ఆలయంలో విశేష పూజలు చేశారు. విశేష అలంకరణలో దర్శనమిచ్చిన సుబ్రహ్మణేశ్వర స్వామిని పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా అభిషేకంలో పాల్గొన్న భక్తులకు ఆలయ అర్చకులు సుబ్రమణ్యషష్టి విశిష్టతను వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు.



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

ఏళ్ల కల... నెరవేరిన వేళ..

- జిల్లాగా మదనపల్లె
- పడమట మరింత అభివృద్ధి
- పారిశ్రామిక రంగానికి ఊతం
- వలసలకు అడ్డుకట్ట.. విరివిగా ఉపాధి



మదనపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ప్రకటనతో అన్ని వర్గాల్లో సానుకూల వాతావరణం కనిపిస్తోంది. ఇంతకాలం భావోద్వేగ భరితంగా ఎదురు చూస్తున్న ఇక్కడి ప్రజల చిరకాల కోరిక, ఆకాంక్ష నెరవేరడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం, ముఖ్యంగా సీఎం చంద్రబాబునాయుడు తీసుకున్న ఈ నిర్ణయంతో మదనపల్లె కేంద్రంగా అటు తంబళ్లపల్లె, ఇటు పీలేరు, పుంగనూరు ప్రాంతాలు కూడా మరింత అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఏర్పడింది. అటు కర్ణాటక, ఇటు తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు గల మదనపల్లెలో ప్రశాంత, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. ప్రస్తుతం జిల్లా కేంద్రంగా అవతరిస్తున్న తరుణంలో మదనపల్లే కాదు.. పడమటి ప్రాంతం రూపురేఖలు మారనున్నాయి. వ్యాపార, వాణిజ్య కేంద్రమైన బెంగళూరు వంద కిలోమీటర్లు లోపే ఉండటం మదనపల్లెకు కలిసొచ్చే పరిణామంగా చెప్పవచ్చు.

నాలుగేళ్లుగా కుదేలైన రియల్ ఎస్టేట్, నిర్మాణరంగం పుంజుకోనుండగా, పాతాళానికి పడిపోయిన భూముల క్రయ, విక్రయాలు పెరిగే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో పడమట కేంద్రంగా ఉపాధి నిమిత్తం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లే వలసలకు కూడా బ్రేక్ పడనుంది. ఇప్పటికే సెలెక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న మదనపల్లె జిల్లా కేంద్రంగా కార్పొరేషన్ దిశగా అడుగులు పడనున్నాయి. మదనపల్లె జిల్లా కేంద్రంగా మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాలతో ఏర్పాటు చేయడాన్ని ఇక్కడి ప్రజలు స్వాగతిస్తున్నారు. దేశంలోనే అతి పెద్ద రెవెన్యూ డివిజన్ కేంద్రంగా, నాటి బ్రిటీష్ పాలకుల ఏలుబడి కేంద్రంగా అన్ని అర్హతలున్న మదనపల్లెను గత పాలకులు రాజకీయ స్వలాభానికి ఇక్కడి ప్రజల మనోభావాలను దెబ్బతీశారనే అపవాదు ఉంది. ఇక్కడి మెజారిటీ ప్రజల మనోభావాలు, ఆకాంక్షను గుర్తించిన అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుతం సీఎం చంద్రబాబునాయుడు జిల్లా కేంద్రం ప్రకటనతో అవన్నీ పటాపంచలయ్యాయి.

పట్టణ అభివృద్ధి దిశగా..

1960లో గ్రామ పంచాయతీగా ఉన్న మదనపల్లె అంచెలంచెలుగా విస్తరించింది. ప్రస్తుతం 35 వార్డులు, 2.50 లక్షల జనాభా, 14.20 చ.కి. విస్తీర్ణంతో సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా ప్రజలకు సేవలందిస్తోంది. ఈ క్రమంలో 2040 నాటికి మదనపల్లె ముఖచిత్రాన్ని రూపొందిస్తూ మాస్టర్‌ప్లాన్ కూడా ప్రభుత్వం నుంచి ఆమోదం పొందింది. ప్రస్తుత జిల్లా ప్రకటన ఏరియాలన్నీ 35 కి.మీ. నుంచి 50 కి.మీ. దూరంలోనే ఉండటంతో జిల్లా కేంద్రానికి వివిధ పనుల మీద వచ్చే ప్రజలకు అనుకూలంగా ఉండనుంది. జిల్లా కేంద్రానికి పాలనాపరంగా, కార్యాలయపరంగా ఉండాల్సిన అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో ఉండటం, కొత్తగా నిర్మించే భవనాలు, కార్యాలయాలకు పట్టణం చుట్టూ విశాలమైన ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయి. మరోవైపు ముంబై-చెన్నై, బెంగళూరు-కడప, తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారులు అందుబాటులో ఉండటం, మదనపల్లెకు బెంగళూరు సరిహద్దు కావడంతో అటు వ్యాపార, ఇటు పారిశ్రామిక రంగానికి దోహదపడనుంది.

అనుకూలమైన వాతావరణం

భౌగోళిక పరిస్థితులతో పాటు ప్రశాంత, ఆహ్లాదకరమైన వాతావరణానికి పెట్టింది పేరు మదనపల్లె. ముఖ్యంగా ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు మదనపల్లె స్వర్గధామంగా పేరుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎక్కడ ఉద్యోగం చేస్తున్నా.. ఉద్యోగులు, సిబ్బంది మదనపల్లెలో నివాసం ఉంటూ ఇక్కడి నుంచే విధులకు వెళుతుంటారు. ఇక్కడి వాతావరణానికి అలవాటుపడటంతో పదవీ విరమణ తర్వాత శేషజీవితాన్ని ఇక్కడే గడపటానికి ఇక్కడే స్థిరపడుతున్నారు.

జిల్లా, డివిజన్ కేంద్రాలతో..

జిల్లా కేంద్రంలో జిల్లా, డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. దీంతో ఉద్యోగులు, సిబ్బంది సంఖ్యతో పాటు వివిధ పనుల మీద పట్టణానికి వచ్చే ప్రజల రాకపోకలు పెరగనున్నాయి. దీంతో వ్యాపారాలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. తాగునీటికి అవసరమైన చిప్పిలి, గుట్టకిందపల్లె ఎస్.ఎస్.ట్యాంకులు పూర్తి కాగా, హంద్రీ-నీవా జలాలు కూడా అందుబాటులో ఉండటంతో పట్టణానికి తాగునీటి సమస్య తీరినట్లే. మదనపల్లె జిల్లా కేంద్రం రాజకీయ పరంగా కాకుండా ప్రజల మనోభావాలు, భావోద్వేగ ఆకాంక్షలకు అనుగుణంగానే కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో తమ భవిష్యత్తుకు బాటలు వేస్తుందని ఇక్కడ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

1911లోనే జిల్లా కావాల్సి ఉండేది



1911లో కడప జిల్లా విభజన సమయంలోనే మదనపల్లె జిల్లా కావాల్సి ఉంది. అప్పుడు మదనపల్లెకు మోసం చేసి చిత్తూరుకు తరలించుకుపోయారు. పట్టణ ప్రజల 116 ఏళ్ల కల ఇప్పుడు నెరవేరింది. పట్టణంలో మౌలిక సౌకర్యాలు మెరుగుపడతాయి. దగ్గర్లోని బెంగళూరు ఐటీ సంస్థలు తరలివచ్చే అవకాశం వుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. చేనేతకు ప్రత్యేక గుర్తింపు ఇస్తే గొప్పసిల్క్ టౌన్‌గా మదనపల్లె అభివృద్ధి చెందుతుంది. రైతులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్న టమోటా అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి.

- పీటీఎం శివప్రసాద్, జిల్లా సాధనసమితి, కన్వీనర్, మదనపల్లె

సేవలు ప్రజలకు మరింత చేరువ



జిల్లా కేంద్రం ఏర్పాటుతో పాలనా సౌలభ్యం అందుబాటులోకి వస్తుంది. సేవలు కూడా ప్రజలకు మరింత చేరువ కావడానికి అనుకూలంగా ఉంటుంది. ప్రభుత్వం, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేస్తారు. వ్యవస్థలు పటిష్టంగా పనిచేయడానికి ఆస్కారం ఏర్పడుతుంది. అధికారుల్లో జవాబుదారీతనం పెరుగుతుంది. కలెక్టర్, జిల్లా అధికారుల పర్యవేక్షణ వుంటుంది. సమస్యలు వేగంగా పరిష్కారం అయ్యే అవకాశం ఎక్కువ. వ్యాపారాలు పెరిగి ప్రజల జీవన విధానంలో మార్పులు వస్తాయి.

- ఎన్.జగన్నాథరెడ్డి, రిటైర్డ్ వీఆర్వో, మదనపల్లె.

ఈ ప్రాంతానికి జిల్లా అవసరం కూడా



ఏ ప్రాంతం అయినా అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే జిల్లా కేంద్రం ప్రాతిపాదక అనేది ఉంటుంది. అందులోని జనాభాను బట్టే బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారు. ఎప్పుడో బ్రిటీష్‌కాలం నుంచే మదనపల్లె నిర్లక్ష్యానికి గురైంది. ముఖ్యంగా ఈ ప్రాంతం నుంచి ఉపాధి కోసం వలసలు ఎక్కువగా ఉంటున్నాయి. వీటిని అరిట్టాలంటే ఉపాధి అవకాశాలు మెరుగుపడాలి. పరిశ్రమలు రావాలంటే జిల్లాతోనే సాధ్యం అవుతుంది. గత వైసీపీ ప్రభుత్వం చేసిన అన్యాయంపై పెద్దపోరాటమే చేశాం. 636 రోజులు ఉద్యమాలు చేపట్టి ఇప్పటికీ కేసులు ఎదుర్కొంటున్నాం.

- టి.కృష్ణప్ప, సీపీఐ జిల్లా సంయుక్త కార్యదర్శి, మదనపల్లె.

జనార్దన్‌రావే నిధులు సమకూర్చాడు

6

- విచారణలో వెల్లడించిన కట్టా రాజు, బాలాజీ   ముగిసిన కస్టడీ.. జైలుకు తరలింపు

ఆ.. అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దయ్యేనా...?

6

- మాకు న్యాయం చేయాలంటూ బాధితుల ఫిర్యాదు
- చర్యలు తీసుకుంటామన్న డీఐజీ

30 లోపు 'పది' పరీక్ష ఫీజు చెల్లించాలి

- డీఈవో సుబ్రహ్మణ్యం



మీడియాతో మాట్లాడుతున్న డీఈవో సుబ్రహ్మణ్యం

రాయచోటిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు ఈనెల 30వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం ఆయన స్థానిక డీఈవో కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పరీక్ష ఫీజు చెల్లించే సమయంలో విద్యార్థి తనకు సంబంధించిన పుట్టిన తేదీ, ఇంటి పేరు, తల్లిదండ్రుల పేర్లు తదితర వివరాలన్నీ స్పష్టంగా చెక్ చేసుకుని ఫీజు చెల్లించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అపార్ ఐడీ పూర్తి కాని విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించుకుని విద్యార్థి ఆధార్‌కార్డు, అడ్మిషన్ రిజిస్టర్‌ను పరిశీలించి వారికి ఏయే వివరాలు అవసరమో తెలుసుకుని ఒక అఫిడవిట్ తీసుకొని ఆ వివరాలను నమోదు చేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెల్

2026 మార్చిలో జరగబోయే పరీక్షలకు ఫీజు చెల్లింపులో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఒక ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ కొండూరు శ్రీనివాస రాజు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు కానీ, విద్యార్థులు కానీ ఫోన్ చేసి సమస్యను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కె.శ్రీనివాస రాజు అసిస్టెంట్ కమిషనర్ (94409 82462), రవికుమార్ (సూపరింటెండెంట్ - 90144 66800), మున్నా (సీనియర్ అసిస్టెంట్ - 93988 56110), రంగనాథ్ (జూనియర్ అసిస్టెంట్ - 63033 80930) సంప్రదించవచ్చని తెలిపారు.

మట్టికుప్పల తొలగింపు

- కొనకుంట్లపల్లె దారి సమస్య పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మట్టికుప్పలను తొలగిస్తున్న అధికారులు

మదనపల్లె టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొనకుంట్లపల్లె దారి సమస్య పరిష్కారమైంది. అధికారులు ఎక్స్‌కవేటర్‌తో మట్టికుప్పలు తొలగించారు. పల్లె దారికి అడ్డంగా మట్టికుప్పలు అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి మట్టికుప్పలను తొలగించారు. మదనపల్లె మండలం కొనకుంట్లపల్లెలో పల్లెదారిని కొందరు మట్టికుప్పలు పోసి మూసివేశారు. దీనిపై రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ క్రమంలో ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించి వెంటనే రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులను కొనకుంట్లపల్లెకు పంపించారు. వీఆర్వో విశ్వనాథ్, పంచాయతీ కార్యదర్శి బాలాజి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసి, వారి రక్షణతో కొనకుంట్లపల్లె దారికి అడ్డంగా వేసిన మట్టికుప్పలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఇక మీదట ఎవరైనా దారిని అడ్డుకుని గ్రామస్థులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మార్కెట్‌యార్డులో జాక్‌పాట్ రద్దు

- కిలోకు రూ.10 తగ్గిన టమోటా ధరలు



టమోటా వేలం పాటలను పరిశీలిస్తున్న చైర్మన్ శివరాం, డైరెక్టర్లు

మదనపల్లె టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మార్కెట్‌యార్డులో పాలకమండలి చెప్పిన విధంగా టమోటా వేలం పాటల్లో జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేశారు. బుధవారం స్థానిక టమోటా మార్కెట్‌లో 20 మండీలకు వచ్చిన టమోటాలను వేలం నిర్వహించారు. చైర్మన్ శివరాం, డైరెక్టర్లు, మార్కెట్ యార్డు కార్యదర్శి జగదీశ్ ప్రతి మండీకి వెళ్లి వేలం పాటలను పరిశీలించారు. శివరాం మాట్లాడుతూ జాక్‌పాట్ విధానం రద్దు వలన రైతులు నష్టపోయే అవకాశం లేదని, అంతేకాకుండా వేలంలో టమోటాకు పాడిన ధర తగ్గించకుండా రైతులకు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా వారం రోజులుగా మదనపల్లె మార్కెట్‌లో నాణ్యమైన టమోటా కిలో గరిష్టంగా రూ.61 నుంచి రూ.65 వరకు పలకగా, రెండో రకం టమోటా కనిష్టంగా కిలో రూ.33 నుంచి రూ.52 వరకు పలికాయి. కాగా జాక్‌పాట్ విధానం ఎత్తివేయడంతో వ్యాపారులు టమోటా ధరలను ఒక్కసారిగా కిలోకు రూ.10 తగ్గించి కొనుగోలు చేయడం గమనార్హం. కార్యక్రమంలో డైరెక్టర్లు బాబు, లక్ష్మీపతి, సుబ్రహ్మణ్యం రెడ్డి, రవి, ఏఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లికి వెళ్లి వస్తూ.. తిరిగిరాని లోకాలకు

- కారు, కంటైనర్ ఢీ : ఇద్దరి మృతి
- మృతులు శ్రీసత్యసాయి జిల్లా వాసులు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ములకలచెరువు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెళ్లికి వెళ్లి.. బంధువులతో కలిసి సంతోషంగా గడిపారు.. ముహూర్తం చూసుకుని కారులో తిరిగి వస్తుండగా అంతలేనే మృత్యువు కబళించింది. ముంబై-చెన్నై జాతీయ రహదారిలో కారు, కంటైనర్ ఢీకొని ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం సాపిరెడ్డిగారిపల్లెకు చెందిన చాపిరెడ్డి వెంకటరమణ (65), చాపిరెడ్డి రాజశేఖర్ (40) ఇద్దరూ బంధువులు. కొన్నేళ్లుగా ఇరు కుటుంబాలు మదనపల్లెలో నివాసముంటున్నాయి. సీవీ వెంకటరమణ ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొంది చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. సీవీ రాజశేఖర్ మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం రాత్రి శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం తవళంలో బంధువుల ఇంట్లో జరిగిన పెళ్లికి కారులో వెళ్లారు. బుధవారం ఉదయం ముహూర్తం చూసుకుని తిరిగి కారులో మదనపల్లెకు బయలు దేరారు. ఈ క్రమంలో వేపూరికోట వద్ద కారు, కంటైనర్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరూ కారులోనే ఇరుక్కుపోయి మృతి చెందారు. మృతదేహాలు కారులోనే ఇరుక్కుపోవడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంలో అతికష్టం మీద బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని సీఐ వెంకటేశులు, ఎస్ఐ నరసింహుడు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



వెంకటరమణ, రాజశేఖర్ మృతదేహాలు

ప్రపంచంలోనే భారత రాజ్యాంగం అత్యుత్తమం

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్
- కలెక్టరేట్‌లో ఘనంగా 76వ రాజ్యాంగ దినోత్సవం



ప్రతిజ్ఞ చేయిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యుత్తమైన రాజ్యాంగం భారత రాజ్యాంగం అని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో 76వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత భారతరత్న బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి జేసీ, డీఆర్వో మధుసూదన్‌రావులు జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 76వ రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు రాజ్యాంగ పీఠికను చదువుతూ కార్యక్రమానికి హాజరైన వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో....



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి, తదితరులు

రాయచోటిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశాన్ని ఒక తాటిపై నడిపిన ఘనత భారత రాజ్యాంగానికి దక్కుతుందని జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి అన్నారు. 76వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన పోలీసు అధికారులు, సిబ్బంది, కార్యాలయ సిబ్బందితో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం, సమసమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్ఐలు వీజే రామకృష్ణ, ఎం.పెద్దయ్య, డీసీఆర్బీ సీఐ ఎం.తులసీరాం, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో సిబ్బంది, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రవాణా భత్యం

- ప్రభుత్వ బడుల్లో హాజరు పెంచడమే లక్ష్యం
- 3039 మంది విద్యార్థులకు రూ.91.17 లక్షలు విడుదల

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ బడుల్లో చదివే పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థుల రవాణా సౌలభ్యం కోసం ప్రభుత్వం 3039 మంది విద్యార్థులకు రూ.91.17 లక్షలు తొలి విడత సోమవారం విడుదల చేసింది. ఈ నిధులు విద్యార్థుల తల్లుల ఖాతాకు జమ అవుతాయి. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నిరంతరం చదువుకు ఈ పథకం ఎంతో దోహదపడుతుంది. గ్రామీణ ప్రాంత వెనుకబడిన, కుటుంబాల విద్యార్థుల ఆర్థిక పరిస్థితుల కారణంగా బడులకు దూరంగా ఉండేవారు. డ్రాపౌట్స్‌ను తిరిగి బడుల్లో చేర్పించేలా, ప్రభుత్వ బడుల్లో హాజరును పెంచేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. దీంతో విద్యార్థులకు రవాణా ఖర్చులు తగ్గి నిరంతరం చదువుకునేందుకు కూటమి ప్రభుత్వం చక్కటి అవకాశాన్ని కల్పించింది. తల్లికి వందనం, ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ ఇలా ప్రతి ఒక్కటి కల్పిస్తూ విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎన్నో పథకాలను తీసుకువస్తోంది.



ఆటోలో పాఠశాలకు వస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు



విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సూచనలు, సలహాలతో విద్యా వ్యవస్థలో సూచనలు, సలహాలతో విద్యా వ్యవస్థలో నూతన మార్పులను తీసుకొచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు చదువు కోసం తల్లికి వందనం, రవాణా సౌకర్యాలను నిధులు కేటాయింపు వంటి పథకాలతో ప్రోత్సహిస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పేద విద్యార్థులకు విద్యను అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. పేద విద్యార్థులు ఇలాంటి పథకాలను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకొని భవిష్యత్తులో వారి ఆశయాలను నేరవేర్చుకోవాలి.

- నల్లమల రామాంజులు, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా సభ్యుడు, రాయచోటి

రవాణా భత్యం... నిబంధనలు

గ్రామీణ ప్రాంతంలో పేద, వెనుకబడిన విద్యార్థులై ఉండాలి. 5వ తరగతి లోపు విద్యార్థులు ఒక కిలోమీటర్ పరిధిలో ఉన్న వారికి వర్తిస్తుంది. 6, 7, 8వ తరగతి విద్యార్థులకు 3 కిలోమీటర్ల లోపు ఉన్న వారికి వర్తిస్తుంది. 9, 10 విద్యార్థులు 5 కిలోమీటర్ల లోపు ఉన్న వారికి వర్తిస్తుంది. అయితే వారికి విధించిన కిలోమీటర్ల పరిధిలో మధ్యలో ప్రభుత్వ బడి ఉండరాదు. ఈ నిబంధనల ప్రకారం ఒక విద్యార్థికి 6 వేల రూపాయలు రవాణా భత్యం కింద మంజూరు చేసింది.

తొలి విడతలో జిల్లాలో 3039 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 3 వేల రూపాయలు చొప్పున వారి తల్లుల ఖాతాకు జమ చేశారు. పాఠశాలకు విద్యార్థులు స్థానిక ఆటోల సహకారంతో పాఠశాలకు వస్తున్నారు. ప్రభుత్వ బడులను నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో ఉత్తమ బోధనలను అందిస్తూ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తున్నారు. సంబేపల్లె మండలంలో సుమారు 18 పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుంది. ప్రాథమిక పాఠశాలలతో పాటు హైస్కూల్ చదివే విద్యార్థులు ఈ సౌకర్యాన్ని పొందుతున్నారు.



సంబేపల్లె మండలం వళ్లంగడ్డ పాపన్నగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

ప్రభుత్వ బడుల బలోపేతం



గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపే విద్యార్థులు ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ఉత్తమ విద్యా బోధన వివిధ సంక్షేమ పథకాలతో ప్రభుత్వ బడుల వైపు ఆకర్షితులవుతున్నారు. ప్రతి తరగతిలో హాజరు సంఖ్య పెరిగింది. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను పొందడం ప్రభుత్వ పాఠశాలలకే సాధ్యం.

- కొండూరు మురళీమోహన్‌రాజు, ఉపాధ్యాయుడు, రాయచోటి

'రైతన్నా.. మీకోసం' సబ్‌కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



రైతన్నా..మీకోసం కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ భావన

నందలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆడపూరు గ్రామంలో జరుగుతున్న రైతన్నా... మీకోసం కార్యక్రమాన్ని రాజంపేట సబ్‌కలెక్టర్ ఎస్.భావన బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆమె కార్యక్రమం జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులు ఏయే పంటలు సాగు చేస్తున్నారు, దాంట్లో ఎలాంటి మద్దతు ధర లభిస్తుంది అనే విషయాల గురించి రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, మండల వ్యవసాయాధికారి మల్లికార్జున, మార్కెట్‌యార్డు డైరెక్టర్ సుబ్బయ్య, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అరటి రైతులు అధైర్య పడవద్దు

జిల్లా ఉద్యాన అధికారి సుభాషిణి



పంటలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి సుభాషిణి

రాజంపేట టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాబోవు రోజుల్లో అరటి సాగు చేసిన రైతులు లాభాలు కళ్లజూస్తారని, ఆర్థిక సమస్యలు తొలగుతాయని, అంతవరకూ రైతులు అధైర్యానికి లోనుకావద్దని జిల్లా ఉద్యాన అధికారి సుభాషిణి తెలిపారు. బుధవారం ఆమె రాజంపేట మండలంలోని వరదయ్యగారిపల్లె, పుల్లంపేట మండలంలోని బావికాడపల్లెలో అరటి తోటలను పరిశీలించారు. ప్రస్తుతం 300 నుంచి 500 ఎకరాల్లో పంట 15 రోజుల్లో కోత దశకు చేరుతుందన్నారు. డిసెంబరులో కడప, అన్నమయ్య, అనంతపురం, నంద్యాల జిల్లాల ఉద్యాన అధికారులు అరటిపంట ఎగుమతిదారులతో చర్చలు జరిపి అరటికి సరైన ధర లభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఉద్యాన అధికారి సునీల్, రైల్వేకోడూరు ఉద్యాన అధికారి భాస్కర్, చిట్వేలి ఉద్యాన అధికారి లోకేష్, ఉద్యాన సహాయకులు విష్ణురెడ్డి, ప్రవీణ్, ఉద్యాన రైతులు పాల్గొన్నారు.

అయోమయానికి గురి చేస్తున్నారు : తులసిరెడ్డి

రాజంపేట టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల పునర్వవస్థీకరణ పేరుతో కూటమి ప్రభుత్వం అన్నమయ్య జిల్లా ప్రజలను అయోమయానికి గురి చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ఆరోపించారు. బుధవారం పట్టణంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా నుంచి మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, నియోజకవర్గాలను విడగొట్టి మదనపల్లె జిల్లాలో చేర్చారన్నారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి నియోజకవర్గాలు మాత్రమే ఉంటాయని, వీటితోనే అన్నమయ్య జిల్లాను కొనసాగిస్తారా.. లేక వేరే నియోజకవర్గాలు కలుపుతారా అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూల భాస్కర్, రాజంపేట పట్టణ కమిటీ అధ్యక్షుడు నరేశ్, రాజంపేట మండల శాఖల అధ్యక్షులు మహదేవయ్య, శివ, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉందాం... వైసీపీకి మన సత్తా చూపుదాం

- ఆర్టీసీ రీజనల్ చైర్మన్, ప్రత్యేక పరిశీలకుడు నాగరాజు

ములకలచెరువు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులందరూ ఐక్యంగా ఉండి... వైసీపీకి మన సత్తా చూపుదామని ఆర్టీసీ రీజనల్ చైర్మన్, నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకుడు పూల నాగరాజు, నియోజకవర్గ పరిశీలకుడు దినేశ్‌రెడ్డిలు అన్నారు. స్థానిక కేజీఎన్ కల్యాణమండపంలో బుధవారం జరిగిన మండల టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా ఉండి పార్టీని బలోపేతం చేయాలన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల్లో కూటమి గెలిచే విధంగా కష్టపడి పనిచేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ యువ నేత కట్టా దొరస్వామినాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, సింగిల్ విండో అధ్యక్షుడు గుత్తికొండ త్యాగరాజు, మండల పరిశీలకుడు రెడ్డిశేఖర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబాబు, నేతలు ఎర్రగుడి సురేష్, కేవీ రమణ, చెన్నకిష్టా, వెంకటస్వామి, ముత్తుకూరు మౌళా, సుధాకర్‌నాయుడు, మూగి రవిచంద్ర, నాగరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ములకలచెరువులో మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ చైర్మన్, ప్రత్యేక పరిశీలకుడు పూల నాగరాజు

కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం

పెద్దతిప్పసముద్రం నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని తంబళ్లపల్లె నియోజకవర్గ పరిశీలకుడు పోలంరెడ్డి దినేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం కుమ్మరవాండ్లపల్లె సమీపంలోని విజయగణపతి కల్యాణ మండపంలో టీడీపీ మండల కమిటీ ఎన్నిక ప్రక్రియ సమావేశంలో ఆయన మాట్లాడారు. టి.సదుం పంచాయతీలో టీడీపీకి ఎదురులేని మెజారిటీ కోసం అలుపెరుగని కృషి చేసిన ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మండలంలోని వివిధ గ్రామాల టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జనార్దన్‌రావే నిధులు సమకూర్చాడు

- విచారణలో వెల్లడించిన కట్టా రాజు, బాలాజీ

ములకలచెరువు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ వ్యవహారంలో ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు కీలకమని, నకిలీ మద్యం తయారికి మొత్తం పెట్టుబడి ఆయనే పెట్టాడని కీలక నిందితులు కట్టా రాజు, బాలాజీలు విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. ములకలచెరువు నకిలీ మద్యం కేసులో నిందితులైన కట్టా రాజు, కొడాలి శ్రీనివాసరావు, బాలాజీ, సుదర్శన్, డ్రైవర్ ఆష్రఫ్, చైతన్యబాబులను మూడు రోజుల పాటు కస్టడీకి ఇస్తూ తంబళ్లపల్లె కోర్టు ఈనెల 24వ తేదీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో బుధవారం నాటితో కస్టడీ ముగిసింది. నిందితులను మూడు రోజుల పాటు విచారించిన ఎక్సైజ్ పోలీసులు కీలక విషయాలు రాబట్టారు. నిందితులను కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి విచారించారు. నకిలీ మద్యం తయారికి సంబంధించి అంశాలు, ఆర్థిక లావాదేవిలు, బెల్ట్‌షాపులకు సరఫరా, బెల్ట్‌షాపుల నుంచి నగదు వసూళ్లు, స్పిరిట్ సరఫరా, పాత్ర, సూత్రధారుల గురించి కట్టా రాజు, బాలాజీలను ప్రశ్నించి సమాచారాన్ని రాబట్టారు. కస్టడీ సమయం ముగియడంతో ఐదుగురు నిందితులను వైద్య పరీక్షల అనంతరం మదనపల్లె సబ్‌జైలుకు, కట్టా రాజును నెల్లూరు సెంట్రల్ జైలుకు తీసుకెళ్లారు.



తంబళ్లపల్లె ప్రభుత్వాస్పత్రిలో నిందితులు

జనార్దన్‌రావు.. పీటీ వారెంట్‌కు అనుమతి

ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లె జనార్దన్‌రావును ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరచనున్నారు. ఇబ్రహీంపట్నం కేసులో అరెస్టయి నెల్లూరు జైలులో ఉన్న జనార్దన్‌రావు, అతడి తమ్ముడు జగన్‌మోహన్‌రావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, రమేశ్‌బాబు, అల్లాబక్షులను ములకలచెరువు కేసులో అరెస్టు చూపేందుకు అనుమతి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు. దీంతో ఐదుగురిని ఈనెల 30వ తేదీలోగా హాజరుపరచాలని కోర్టు ఆదేశించింది. దీంతో అద్దేపల్లి జనార్దన్‌రావుతో పాటు ఐదుగురు నిందితులను నెల్లూరు జైలు నుంచి తంబళ్లపల్లె కోర్టుకు తీసుకురానున్నారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి చర్యలు

గాలివీడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురాతన ఆలయాల అభివృద్ధికి దేవదాయ, ధర్మదాయ(శాఖ చర్యలు తీసుకుంటుందని ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శివయ్య తెలిపారు. బుధవారం నూలివీడు దేవరకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, అరవీడు దొనకొండ గంగమ్మ దేవాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన దేవాలయాలను రిజిస్ట్రేషన్, పబ్లికేషన్ చేసేందుకు దేవదాయ శాఖ సత్వర చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం ఆయన మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో పురాతన ఆలయాలను పరిశీలించి ఆలయాల స్థితిగతులను, అర్చకులు, గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు.

ఆ.. అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దయ్యేనా...?

- మాకు న్యాయం చేయాలంటూ బాధితుల ఫిర్యాదు
- చర్యలు తీసుకుంటామన్న డీఐజీ హామీపై ఆశలు

బి.కొత్తకోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన తప్పుడు రిజిస్ట్రేషన్‌లు రద్దు అవుతాయా? బాధితులకు న్యాయం జరుగుతుందా? అక్రమాలకు పాల్పడిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారా? ప్రస్తుతం బి.కొత్తకోట ప్రజలకు, అధికారులకు నివృత్తికాని అనుమానాలివి. న్యాయపరంగా తమకు హక్కు ఉన్న భూములను బి.కొత్తకోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇతరుల పేరున అక్రమంగా రిజిస్టర్ చేసేశారని, ఈ అన్యాయంపై ఎంత న్యాయపోరాటం చేసినా తమకు న్యాయం జరగలేదని పలువురు బాధితులు చేస్తున్న వాదన ఇంతకాలం అరణ్యరోదనగానే మిగిలింది. ఈనెల 24 రిజిస్ట్రేషన్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ (డీఐజీ) రామలక్ష్మీ పట్నాయక్ బి.కొత్తకోటకు చేరుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాల ఆరోపణలపై విచారణ చేపట్టడం, బాధితుల ఆక్రందనలు వినడం, లిఖితపూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించడం, వాటిపై సమగ్రంగా విచారించి న్యాయం చేస్తామని హామీ నివ్వడంతో ఆశలు చిగురించాయని ఫిర్యాదులు చేసిన బాధితులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- బి.కొత్తకోట సబ్‌రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ మొత్తంలో 1 శాతం లంచంగా తీసుకుంటున్నారని, స్టాంప్‌రైటర్లు ఇష్టారాజ్యంగా కార్యాలయ సిబ్బందిని తమ చెప్పుచేతల్లో పెట్టుకొని, రైతుల సొమ్ము దోచుకుంటున్నారన్న ఫిర్యాదుల మేరకు విచారణకు వచ్చిన డీఐజీ రామలక్ష్మీపట్నాయక్‌కు విస్తుపోయే సాక్ష్యాలు, ఆధారాలు దొరికాయి. కార్యాలయ అవినీతిపై బహిరంగంగా జనం ఏకరువు పెట్టారు. చిన్నపాటి మొత్తాలే కాకుండా ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు, వివాదాస్పద స్థలాల విషయంలో ఏకపక్ష నిర్ణయాలతో రిజిస్ట్రేషన్లు చేసినందుకు రూ.లక్షలు చేతులు మారినట్లు డీఐజీకి ఆరోపణలు వచ్చాయి. ఈ సందర్భంగా డాక్యుమెంట్ల జిరాక్స్‌లతో పాటు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు ఇవ్వాలన్న ఆమె ఆదేశాల మేరకు పలువురు అర్జీలు సమర్పించారు. వాటిలో కొన్ని...



డీఐజీ రామలక్ష్మీ పట్నాయక్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

- బి.కొత్తకోట మండలంలోని బీరంగి పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 865-1ఏలో 1.66 ఎకరాల భూమికి సంబంధించి తన తండ్రి వి.ప్రభాకర్‌రావు పేరున పట్టాదార్ పాస్‌బుక్, మాన్యువల్1బి, అడంగల్, అనుభవ సర్టిఫికెట్, సబ్ డివిజన్ స్కెచ్, ఆర్‌హెచ్ నకలు ఉన్నాయని, తన తండ్రి 2012లో చనిపోతే 2013లో శ్రీనివాసులు, మరో ఇద్దరు చేరి ఈ భూమిని ఇతరులకు రిజిస్టర్ చేసిచ్చారని ఇది అక్రమం అని బి.కొత్తకోటకు చెందిన వి.మంజునాథ్ ఫిర్యాదు చేశారు.
- బి.కొత్తకోట మండలం గ్రామలెక్క దాఖలా సర్వే నెంబరు-309ఏ, తమకు రిజిస్టర్ డాక్యుమెంట్ ఉన్న భూమిని ఇతరుల పేరిట చేసిన రిజిస్ట్రేషన్ అక్రమమని, తమకు కోర్టు జడ్జిమెంట్, ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నా న్యాయం జరగలేదని, దానిని రద్దు పరచాలని బి.కొత్తకోట దర్గావీధికి చెందిన జేయస్ అస్లంబాషా డీఐజీకి పిర్యాదు చేశారు.
- బి.కొత్తకోట పట్టణంలోని సర్వే నెంబర్లు-337, 338, 339లలో విక్రయం ద్వారా డాక్యుమెంట్ నెంబరు-3186-1958 ప్రకారం తన తండ్రి బి.ఖాశింసాబ్‌కు సంక్రమించిన భూమిని ఇతరులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, దానిని రద్దు పరచాలని పట్టణంలోని సింహం వీధికి చెందిన బి.సయ్యద్‌సాబ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

కాగా ఇలాంటి ఫిర్యాదులతో పాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తమ విచారణలో తేలిన అంశాలపై రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్‌కు నివేదిక సమర్పించారని తెలుస్తోంది. చర్యలు ఏ మేరకు ఉంటాయో మున్ముందు తెలియనుంది.

పారదర్శకంగా నిర్వహించాలి

రైతన్నా.. మీకోసంలో సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి



మేకలవాండ్లపల్లెలో రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

మదనపల్లె టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి సూచించారు. బుధవారం మదనపల్లె మండలం మేకలవాండ్లపల్లె నిర్వహిస్తున్న రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని సబ్‌కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ రైతులు సర్వసాధారణంగా మెట్టభూముల్లో వేసే వరి పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలన్నారు. ఉద్యాన పంటల సాటుకు తప్పనిసరిగా డ్రిప్ విధానంతో నీటిని అందించాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రీయ ఎరువులను ఉపయోగించాలన్నారు. ఒక్కోసారి పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదని రైతులు సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకురాగా... రైతులే ఎఫ్‌పీవోలను ఏర్పాటు చేసుకుంటే వాటిని ప్రోత్సహిస్తామని రైతుల వద్దకే వ్యాపారులు వచ్చి పంట కొనుగోలు చేసేలా రైతులకు గిట్టుబాటు ధరలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. మిగిలిన మూడు రోజుల్లో రైతన్నా మీకోసం కార్యక్రమ లక్ష్యాలను చేరుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నవీన్‌కుమార్, వీహెచ్‌ఏ, రైతులు పాల్గొన్నారు.

వరి పంటపై అడవి పందుల దాడి



పందులు ధ్వంసం చేసిన పంటను చూపుతున్న రైతు

సుండుపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోతకు వచ్చిన వరి పొలాల్లో అడవి పందులు దాడి చేసి తీవ్రంగా నష్టపరిచాయని రైతు రామాంజుల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని భాగంపల్లి సమీపంలో తాను సాగు చేసిన రెండు ఎకరాల వరి పొలంలో మంగళవారం రాత్రి అడవి పందులు దాడి చేసి నష్టపరిచాయని తెలిపారు. పంట సాగుకు రూ.60 వేలు ఖర్చు చేశానని, వారం రోజుల్లో కోయాల్సి ఉండగా 70 శాతం పంటను పందులు నాశనం చేశాయని, ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరారు.

ఎఫ్‌పీవోల ద్వారా మార్కెటింగ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ మాస్ సీఈవో సీఎస్ రెడ్డి

పీలేరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మామిడి పంటను రైతు ఉత్పత్తిదారుల సంఘాల(ఎఫ్‌పీఓలు) ద్వారా మార్కెటింగ్ చేసుకోవాలని పీలేరులోని ఏపీ మాస్ సంస్థ సీఈవో సీఎస్ రెడ్డి రైతులకు సూచించారు. వచ్చే సీజన్‌లో మామిడి మార్కెటింగ్‌కు అవలంభించాల్సిన పద్ధతులపై బుధవారం పీలేరు ఏఎంసీ ప్రాంగణంలో రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ ఉత్పత్తులకు మెరుగైన ధరలు రావడానికి రైతులు సంస్థాగతంగా, శాస్త్రీయంగా, సమన్వయంగా పనిచేయాలన్నారు. పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి మాట్లాడుతూ వచ్చే సీజన్‌లో మార్కెట్ కమిటీ ఆవరణలోనే రైతులకు అన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం రైతులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ మాస్ మేనేజర్ డాక్టర్ భార్గవి, ఏఎంసీ సభ్యులు కలప రవి, గోళ్ల కిశోర్ నాయుడు, రహంతుల్లా, ఏపీ మాస్ పాలకవర్గ సభ్యులు సహదేవరెడ్డి, బోడేషావలి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్వ్యాయ్ పోటీల్లో బంగారు పతకం



మజహర్ అలీని అభినందిస్తున్న దృశ్యం

మదనపల్లె టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్వ్యాయ్ పోటీల్లో మదనపల్లె వాసి మజహర్ అలీ బంగారు పతకం సాధించాడని శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 24, 25 తేదీల్లో నంద్యాలలో నిర్వహించిన 8వ రాష్ట్ర స్థాయి స్వ్యాయ్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి మజహర్ అలీ పాల్గొన్నాడన్నారు. ఈ పోటీల్లో అద్భుత ప్రతిభ కనపరచి బంగారు పతకం సాధించాడన్నారు. ప్రిన్సిపాల్ రమాదేవి, పీడీలు శరత్, జగదీష్ అభినందించారు.

కళాశాల భూమి కబ్జాపై ఫిర్యాదు

కలికిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలకు కేటాయించిన భూమిని కబ్జా చేశారని కళాశాల యాజమాన్యం బుధవారం తహసీల్దారుకు ఫిర్యాదు చేసింది. ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి తరఫున కళాశాల అధికారులు ఈ మేరకు తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. 2009లో ప్రభుత్వం ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల కోసం 49.18 ఎకరాలు కేటాయించారని, ఆ తరువాత అందులో నుంచి 7 ఎకరాలు సైనిక్ స్కూల్‌కు పోగా ఇటీవల జాతీయ రహదారి విస్తరణ కోసం మరో 4.4.6 ఎకరాలు తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందులో భాగంగా 598 సర్వే నెంబరులో ఉన్న 6.01 ఎకరాల్లో కొంతభాగం ఒక వ్యక్తి ఆక్రమించుకున్నాడని, దీనిపై కళాశాల సిబ్బంది ఆక్రమణదారుడిని అడ్డుకునేందుకు ప్రయత్నించినట్లు వివరించారు. సర్వే నెంబరు-598కి బదులు రీసర్వేలో కేటాయించిన ఎల్‌పీఎం నెంబర్లు తప్పులతడకగా ఉన్నాయని, వాటిని సరిదిద్ది ఒరిజినల్ ఎల్‌పీఎం 2600ను సబ్ డివిజన్ చేయించాలని కోరారు. దీనిపై విచారణ చేసి ఆక్రమిత భూమిని గుర్తించి నివేదించాల్సిందిగా మండల సర్వేయర్‌ను తహసీల్దారు ఆదేశించారు. అనధికారిక సమాచారం మేరకు కళాశాలకు కేటాయించిన భూమిలో ఒక ఎకరాను కబ్జా చేసి విక్రయాలు కూడా జరిపారని చెబుతున్నారు. దీనికోసం మూడేళ్ల కిందట రెవెన్యూ అధికారులే రికార్డులను తారుమారు చేసి కబ్జాదారుడి పేరుతో భూమి బదలాయించినట్లు సమాచారం. ప్రస్తుత అధికారులు మొత్తం వ్యవహారంపై కూపీ లాగుతున్నట్లు చెబుతున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్

వల్లూరు/కమలాపురం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పంచ సూత్రాలు, సాగు విధానంలో తీసుకువస్తున్న వినూత్న మార్పులపై రైతులకు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా వ్యవసాయధికారి చంద్రనాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు శ్రేయస్సు కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా మూడో రోజు బుధవారం జిల్లాలోని వల్లూరు మండలం తోళ్లగంగన పల్లెలో రైతుల ఇంటికి వెళ్లి రైతు సంక్షేమ కార్యక్రమాలపై రాష్ట్రప్రభుత్వం ప్రచురించిన కరపత్రాలను ఆయన రైతులకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభతత్వం రైతుల కోసం అనేక రైతు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమం ద్వారా 3వ రోజుకు చేరకుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 1,20,932 మంది రైతు కుటుంబాలను సందర్శించడం జరగిందన్నారు. అన్నదాత సుఖీభవ, సబ్సిడీ విత్తనాల పంపిణీ తదితర అంశాలతో పాటు ప్రస్తుత రబీ సీజన్‌లో ఎదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలన్న అంశాలపై రైతులతో చర్చించారు. నర్సరీల ఏర్పాటు, సబ్సిడీలు, మైక్రో ఇరిగేషన్ పథకాలు కోల్డ్ స్టోరేజీ ఏర్పాటుకు సహకారం వంటి చర్యలతో ఉద్యానవన శాఖ రైతులకు అండగా నిలుస్తుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఉద్యానపంటలకు ఉన్న భారీ డిమాండ్లను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎగుమ తుల అవకాశాలను కూడా అందిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా పంచ సూత్రాల ద్వారా రైతులకు మేలు చేసే కార్యక్రమాలపై ఈనెల 29 వరకు ప్రతి రైతు ఇంటికి అధికారులు, ప్రజాప్రతి నిధులు వచ్చి రైతులకు అవగాహన పెంచుతారన్నారు. రైతు సేవాకేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను రైతులు సద్విని యోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అనుబంధశాఖల అధికారులు పాల్గన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్

సబ్సిడీతో డ్రిప్ పరికరాలు

ఏపీఎంఐపీ స్కీం ద్వారా ఎస్సీ ఎస్టీ రైతులకు డ్రిప్ పరికరాలను వంద శాతం సబ్సిడీతో, మిగతా రైతులకు 90 శాతంతో డ్రిప్ పరికరాలను అందిస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. బుధవారం కమలాపురం మండల పరిధిలోని నల్లింగాయపల్లెలో నిర్వహిస్తున్న రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రసాయనిక మందులు, ఎరు వులను తగ్గించి వాడాలన్నారు. కార్యక్రమంలో వల్లూరు మండల వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి, కమలాపురం గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఆకిషా, రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంచ సూత్రాల అమలుతో రైతుల ఆర్థికాభివృద్ధి

● జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటిటౌన్/నేతాజీసర్కిల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలోని పంచ సూత్రాల అమలుతో రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంచ సూత్రాల అమలు, అవగాహన కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రాయచోటి మండలం ఇందుకూరుపల్లిలో జరుగుతున్న పంచసూత్రాల అవగాహన కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతన్న మీకోసం కార్యక్రమంలో పంచ సూత్రాలపై అవగాహన, పాడి పశువుల పెంపకం, ఎరువుల వాడకాన్ని తగ్గించడం, తృణ ధాన్యాల వైపు రైతులను మళ్లించడంపై రైతులందరికీ అవగాహన కల్పిస్తున్నారన్నారు. అలాగే సంబేపల్లె మండలం మోటకట్లలో జరుగుతున్న పంచసూత్రాల అవగాహన కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. రైతుసేవ కేంద్రాల్లో ఎరువులు అందుతున్నాయా అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసా యశాఖ అధికారి శివనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతన్నా మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో రన్నర్స్‌గా కస్తూర్బా విద్యార్థినులు

కలసపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ పోటీల్లో జాతీయ స్థాయిలో తమ పాఠశాల విద్యార్థినులు రన్నర్స్‌గా నిలిచినట్లు పెండ్లిమర్రి కస్తూర్బా ప్రిన్సిపాల్ రెడ్డిజ్యోతి తెలిపారు. ఇటీవల జాతీయస్థాయి కబడ్డీ అండర్-19లో పోటీల్లో ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలకు గుర్తింపు తెచ్చిన విద్యార్థినులు కళ్యాణి, షఫియా, మంజుల, శృతి, మహేశ్వరి, సుమాంజలి, నిహారిక, కీర్తి, శిరీష, అమరావతి, కీర్తనలతో పాటు వ్యాయామ ఉపాధ్యాయురాలు వాణిలను ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.



జాతీయస్థాయిలో రాణించిన కస్తూర్బా విద్యార్థినులు

విజయవంతంగా ముగిసిన క్రీడాపోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ జి.రామచంద్రరావు, డాక్టర్ ఎం.మాధవ

పులివెందుల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పులివెందుల ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన అంతర్‌కళాశాలల క్రీడలు, ఆటలు, సాంస్కృతిక, సాహిత్య పోటీలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. ఈసందర్భంగా పులివెందుల ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల డీన్ డాక్టర్ ఎం.మాధవ మాట్లాడుతూ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపి తమ కళాశాల, విశ్వ విద్యాలయ ప్రతిష్టను పెంచారన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో 19 కళాశాలల విద్యార్థులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని సమస్యలకు పరిష్కారం చూపే ఏకైక గ్రంథం రాజ్యాంగం



రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్ని సమస్యలకు పరిష్కారం చూపే ఏకైక గ్రంథం మన రాజ్యాంగం అని వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ తెలిపారు. బుధవారం యోగివేమన విశ్వ విద్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం-2025ను ఘనంగా నిర్వహించారు. వీసీ రాజశేఖర్, ప్రముఖ అధ్యాపకులు, అతిథులు అంబేడ్కర్ చిత్రపటం, విగ్రహానికి నివాళులు అర్పించారు.

అనంతరం జరిగిన సదస్సులో వీసీ మాట్లా డుతూ రాజ్యాంగం దేశానికి పవిత్ర గ్రంథమని, సమ స్యలన్నింటికీ రాజ్యాంగమే మార్గదర్శకమని పేర్కొన్నారు. విద్యార్థులు హక్కులతో పాటు బాధ్యతలు పాటించాలని సూచించారు. మాజీ డీఎస్ ప్రొఫెసర్ ఎం.చెన్నబసవయ్య రిజర్వేషన్ల తత్వం, రాజ్యాంగ అవగాహనపై విశ్లేషణాత్మక ఉపన్యాసం ఇచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ రాజ్యా ంగంలోని ముఖ్యాంశాలు వివరించగా, ప్రిన్సిపల్ టి.శ్రీని వాస్ రాజ్యాంగాన్ని గౌరవిస్తే దేశం 2050 నాటికి మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. డీన్లు రాజ్యాంగ చారిత్రక నేపథ్యం, అంబేద్కర్ ఎదుర్కొన్న కష్టాలు, సమాజంలో ఇంకా కొనసాగుతున్న కుల అంతరాలపై మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. రాజ్యాంగ ప్రియాంబుల్ ప్రదర్శిస్తూ విద్యార్థుల ర్యాలీ నిర్వహించారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన అవసరం



టీకాల నిలువ పద్ధతిని పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

సీకేదిన్నె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వ్యాధినిరోధక టీకాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. స్థానిక భగత్‌సింగ్‌నగర్ పీహెచ్‌సీ పరిధిలోని మామిళ్లపల్లెలో ఆయుష్మాన్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా టీకాల కోసం అవసరమైన ఐస్‌ప్యాక్స్ సక్రమంగా కండీషన్‌లో ఉన్నాయా లేదా అని, టీకాల నిలువ పరిస్థితులు ఎలా ఉన్నాయో ఆరా తీశారు. వ్యాధినిరోధక టీకాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయా, ఎంతమందికి టీకాలు అందించారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. తల్లి, శిశువు ఆరోగ్య సంరక్షణలో టీకాల పాత్రపై ఆరోగ్య సిబ్బంది వివరించాలన్నారు. ప్రజలకు వివరించడం ద్వారా వారి నుంచి పూర్తి సహకారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారులు రాఘవేంద్ర, సీహెచ్‌వో మునిరెడ్డి, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ కట్ చేసినందుకు కేసు నమోదు

కొండాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.కోడూరు వద్ద ఉన్న సోలార్ కంపెనీ కేబుల్ కట్ చేసినందుకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి అనే రైతు తన పొలాన్ని సోలార్ కంపెనీకి లీజుకు ఇచ్చాడు. దీనికి సంబంధించి లీజు ప్రకారం కంపెనీ డబ్బులు చెల్లించింది. కాగా ఈశ్వర్‌రెడ్డి తన పొలంలో సోలార్ కంపెనీ కేబుల్ వేస్తుండగా అడ్డుకున్నాడు. దీంతో ఆయన కంపెనీ ప్రతినిధులతో గొడవపడ్డాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ శివనాగిరెడ్డి తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



బోల్తాపడిన లారీ

వీరపునాయునిపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల-వీరపునాయునిపల్లె ప్రధాన రహదారిలోని పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న బ్రిడ్జి వద్ద బుధవారం తెల్లవారుజామున లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తాపడింది. లారీలో ఉన్న డ్రైవర్ అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. బ్రిడ్జి వద్ద ఇరుపక్కల రక్షణగోడ లేకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని పలువురు భావిస్తున్నారు. కనీసం రేడియం స్టిక్కర్స్ ఉన్నా ప్రమాదం జరిగేది కాదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇరువైపుల రక్షణగోడ నిర్మించాలని కోరుతున్నారు.

విద్యుత్ షాక్... ఆవు మృతి



పెండ్లిమర్రి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉలవలపల్లె గ్రామ పంట పొలాల్లో బుధవారం రైతు బాల గురవయ్యకు చెందిన ఆవు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందింది. విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను కింద ఏర్పాటు చేయడంతో షాక్‌కు గురై ఆవు మృతి చెందిందని బాధిత రైతు తెలిపారు. దాదాపు రూ.50వేలు నష్టం వాటిల్లిందన్నారు. సంఘటనా స్థలాన్ని విద్యుత్ ఏఈ, పశువైద్యాధికారి పరిశీలించారు.

ఆకట్టుకున్న స్కౌట్స్ విద్యార్థుల వేషధారణలు



వివిధ వేషధారణలలో స్కౌట్ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రాజధాని లక్నోలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ కార్యాలయం వారు 19వ నేషనల్ జాంబోరీ, డైమండ్ జూబ్లీ జాంబోరీను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హాజరయ్యారు. రాష్ట్ర ఔన్నత్యాన్ని చాటి చెప్పే విధంగా శ్రీవెంకటేశ్వరస్వామి వేషధారణలో కడప జిల్లా స్కౌట్ మాస్టర్ జగదీష్, పద్మావతి అమ్మవారిగా సవిత్రశ్రీ, లక్ష్మీదేవి అమ్మవారి అవతారంలో సుమనశ్రీ, వీరబ్రహ్మేంద్రస్వామి వేషధారణలో వెంకటసుబ్బయ్య, సిద్దయ్య వేషధార ణలో అల్తాఫ్ జిల్లా గొప్పదనాన్ని, కీర్తిని దేశానికి చాటిచెప్పారు. కార్యక్రమంలో కడప జిల్లాకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ రేంజర్స్ అండ్ రోవర్స్ వివిధ పాల్గొని జయప్రదం చేశారు.

సమర్థవంతమైన నాయకత్వం కోసం అభిప్రాయ సేకరణ

కడప కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంగ్రెస్ పార్టీని సమర్థవంతంగా నడిపించేందుకు నాయకత్వం కోసం ఆసక్తి గల నేతల నుంచి దరఖాస్తులు, అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు ఏఐసీసీ కో ఆర్డినేటర్, కన్యాకుమారి ఎంపీ విజయ వసంత్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంఘటన సుజన్ అభియాన్ కమిటీ జిల్లా పర్యటనలో భాగంగా డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతితో కలసి పాత్రికేయుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా విజయ్ వసంత్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ఏఐసీసీ ఆదేశాల మేరకు అన్ని జిల్లాల్లో ఎస్ఎస్‌ఏ కమిటీ పర్యటిస్తోందన్నారు. ఏఐసీసీ, పీసీసీతో పాటు జిల్లా నుంచి డీసీసీ అధ్యక్షులతో కూడిన ఐదుగురు బృందం పర్యటిస్తోందన్నారు. నియోజకవర్గాల వారీగా వచ్చే నెల 5వ తేదీ వరకు జిల్లా నాయకత్వం బలోపేతం చేసే ఆసక్తి ఉన్న నేతల నుంచి దరఖాస్తులతో పాటు అభిప్రాయ సేకరణ చేపట్టడం జరుగుతోందన్నారు. పార్టీ నాయకులు, అనుబంధ సంఘాలు, కార్యకర్తలు, ప్రజల అభీష్టం మేరకు జిల్లా నాయకత్వాన్ని ఎంపిక చేసేలా ఏఐసీసీ కమిటీకి సమర్పించిన దరఖాస్తులను పంపుతామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట సత్యనారాయణ, రాష్ట్ర జనరల్ సెక్రటరీ నరసింహులు, లీగల్ సెల్ చైర్మన్ సోమశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యిద్ గౌస్‌పీర్, నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు శివ మోహన్‌రెడ్డి, ధ్రువ కుమార్, అశోక్‌రెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐసీసీ కోఆర్డినేటర్

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య సాగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు బుధవారం డ్రాగా ముగిశాయి. వివరాలిలా.. ఏసీఏ క్రికెట్ మైదానంలో నార్త్ జోన్ విన్నర్స్- సౌత్‌జోన్ విన్నర్స్ మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 276 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. తదుపరి రెండవ రోజున బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు 78.4 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో ఎస్.ఎం. ఇజహర్ 50 పరుగులు, రక్షన్‌సాయి 50 పరుగులు చేశారు. దీంతో నార్త్‌జోన్ విన్నర్స్ జట్టుకు 65 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 29 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

కేఎస్‌ఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్- రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్ మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 75.4 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 66 పరుగులు చేసింది. తిరిగి రెండో రోజు బ్యాటింగ్ చేపట్టి 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 337 పరుగుల భారీ స్కోర్ సాధిం చింది. ఇందులో వర్మ 110, ఎం.లికిత్ 71 పరుగులు చేశారు. దీంతో రెస్ట్‌ఆఫ్ సెంట్రల్‌జోన్‌కు 51 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. ఇదిలావుండగా రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టు బౌలర్ ఆర్.ఎస్.క్రిష్ణసాయికి 5 వికెట్లు లభించాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 112 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.



ఆర్.ఎస్. క్రిష్ణసాయి



వర్మ

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ విన్నర్స్- రెస్ట్‌ఆఫ్ సెంట్రల్‌జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటిం గ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 66.5 ఓవర్లలో 224 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. ఇందుకు ప్రతిగా సెంట్రల్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు 31 ఓవర్లలో 5 వికెట్లు కోల్పో యి 96 పరుగులు చేసింది. బుధవారం రెండో రోజు బ్యాటింగ్‌కు దిగి మొత్తం 51.5 ఓవర్లలో 147 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఇందులో తమన్‌సాయి 52 పరుగులు చేశారు. దీంతో రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్టుకు 77 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 62 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 177 పరుగులు చేసింది. ఇందులో కిన్నుకిశాల్ 77 పరుగులు చేయగా, సాయి క్రిష్ణచైతన్య 53 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

వ్యవస్థలు రాజ్యాంగబద్ధంగా నడవాలి

రాయచోటిటౌన్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలు అందరూ గౌరవంగా జీవించడానికి వ్యక్తు లు, వ్యవస్థలు భారత రాజ్యాంగం ప్రకారం నడు చుకోవాల్సి అవసరం ఉందని భారత న్యాయ వాదుల సంఘం అన్నమయ్య, కడప ఉమ్మడి జిల్లాల కమిటీ నేతలు తెలిపారు. రాజ్యాంగ దినో త్సవం సందర్భంగా బుధవారం భారత న్యాయ వాదుల సంఘం కార్యాలయంలో న్యాయవాదులు సమావేశమయ్యారు ఈ సందర్భంగా ఐఏఎల్ వ ర్కింగ్ ప్రెసిడెంట్ టీ. ఈశ్వర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్. ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ వ్య క్తులు గానీ, కార్యనిర్వాహక వ్యవస్థలు గానీ రా జ్యాంగబద్ధంగా నడవని సందర్భాల్లో ఏర్పడుతున్న వివాదాలే.. దేశంలో ఈ రోజు 5 కోట్ల కేసులు న్యాయవ్యవస్థ ముందు పెండింగ్ ఉండడానికి కారణం అవుతున్నాయన్నారు. ఈ వివాదాలను పరిష్కరించడానికి న్యాయవ్యవస్థ చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భారత న్యాయవాదుల సంఘం సహాయ కార్యదర్శి ఖాదర్ బాషా, డీ. నాగముని, హుమయూన్, నాగేశ్వర రావు, వరలక్ష్మి, టీవీ రమణ, జగదీశ్, ఎన్జీవో రెడ్స్ హరీశ్, శివకుమార్, ఇర్షాద్, జగదీశ్, నాగేంద్ర, చింటూ, ఇమ్మానియేల్ థామస్ పాల్గొన్నారు.

సిద్ధవటం: 11వ పోలీసు బెటాలియన్‌లో కమాండెంట్ కె.ఆనందరెడ్డి అంబేడ్కర్‌కు నివాళుల ర్పించారు. రాజ్యాంగంపై విధేయతతో ఉంటామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అసిస్టెంట్ క మాండెంట్ పి.రాజశేఖర్, ఆర్ఐఎస్‌లు, ఆర్ఎస్ఐ లు, ఏఆర్ఎస్ఐఎస్‌లు, సిబ్బంది పాల్గొన్నారు. బెటాలియన్ పాఠశాలలో ప్రధానో పాధ్యాయుడు షామీర్‌బాషా ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో రా జ్యాంగ పీఠిక సామూహిక పఠనం, రాజ్యాంగ విలువలపై ప్రస ంగాలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

రాజంపేట: రాజ్యాంగ విలువలను ప్రతిఒక్కరు తెలుసుకోవాలని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ఓ బులేశు తెలిపారు. బుధవారం కొత్తబోయన పల్లెలోని పీఎం శ్రీఎస్‌జేఎస్ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంవిధాన్ దివస్ సందర్భంగా రాజ్యాంగ విలువలు, వాటి అతిక్రమణలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ, గెలిచిన అభ్యర్థుల ప్రకటన, మాక్ అసెంబ్లీ నిర్వహించారు. విశ్రాంత న్యాయమూర్తులు పలుకూరి రామాంజనేయులు, మన్నేరు వెంకటసుబ్బయ్యలను సీనియర్ న్యాయవాది కృష్ణకుమార్ కార్యాలయంలో రాజంపేట లయన్స్‌క్లబ్ అధ్యక్షులు టి.లక్ష్మీనారాయణ, సెక్రటరి, కోశాధికారి కె.లక్ష్మీనరసింహా, మాజీ రీజియన్ చైర్మన్ గీతాంజలి వెంకటరమణలు, సీనియర్ న్యాయవాది ఎస్.రామచంద్రాజులు శాలువాలు కప్పి జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.

రైల్వేకోడూరురూరల్ : అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ రచన, ఆమోదం ప్రవేశిక అంశాలను విద్యార్థులకు వివరించారు. అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్, ఓఎస్‌ఏ డాక్టర్ ఎల్. ముకుందలక్ష్మీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి. హరి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళా శాలలో ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి , రైల్వేకోడూరు లో దళిత నాయకులు పండుగోల మణి, మాలమహానాడు నాయకులు తదితరులు నివాళి అర్పించారు.



భారత రాజ్యాంగ దినోత్సవంలో న్యాయవాదులు


రాజంపేట: ఓటు హక్కును వినియోగించుకుంటున్న విద్యార్థులు


సిద్ధవటం: 11వ పోలీసు బెటాలియన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసు అధికారులు


రైల్వేకోడూరు: అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

వైసీపీని భూస్థాపితం చేస్తాం

● టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు

సిద్దవటం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అధికారాన్ని అడ్డం పెట్టుకుని వైసీపీ నేతలు నిరుపేదల భూములు, స్థలాలను అ న్యాక్రాంతం చేశారని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆరోపించారు. సిద్దవటంలోని పోలీ సులైన్ క్రాస్ వద్ద బుధవారం టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న 18 గ్రామాల ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ఈ కార్యాలయం ప్రారంభించామన్నారు. వైసీపీ నేతల ఆగడాలు, దౌర్జన్యాలు సహించే ప్రసక్తే లేదని, గతంలో వారు చేసిన దౌర్జ న్యాలు, దోపిడీలను ప్రజా కోర్టులో బట్టబయలు చేస్తామన్నారు. వారానికి ఒకరోజు సిద్దవటంలో ప్రజా దర్బార్‌లో పాల్గొంటానని తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికలో టీడీపీ విజయం కోసం ప్రతి కార్యకర్త ఒక సైనికుడిగా పనిచేసి వైసీపీని భూస్థాపితం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ బోర్డు చైర్మన్ కేకే చౌదరి, రాష్ట్ర పంచాయతిరాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరి కుప్పాల వెంకటసుబ్బయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


ఒంటిమిట్ట: బండలాడుగు పోటీలను ప్రారంభిస్తున్న చమర్తి జగన్‌మోహన్ రాజు

బండలాగుడు పోటీలు ప్రారంభం

ఒంటిమిట్ట : మండలంలోని పెద్దకొత్తపల్లె గ్రామంలోని అభ యాంజనేయస్వామి ఆలయ మూడో వార్షికోత్సవం సందర్భంగా రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆల యాన్ని సందర్శించారు. బండలాగుడు పోటీలను ప్రారంభిం చారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

దళితవాడల అభివృద్ధికి కృషి

సుండుపల్లె : దళితవాడల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. బుధ వారం మండలంలోని పొలిమేరపల్లి గ్రామ పంచాయతీ ఎర్ర గుట్ట దళితవాడలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెల్లో దేవాలయాలతో ప్రజల్లో భక్తిభావం పెరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలోని పలు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌బాబు నాయుడు, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాం నాయుడు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, గ్రామ అధ్యక్షుడు జనార్దన్‌రాజు, బీజేపీ నాయకులు మహేశ్వర్‌రాజు, నాగరాజు, వెంకట్రామరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల కోసమే కార్మిక చట్టాల్లో మార్పులు

● కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం ధర్నా

రాయచోటి కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్లకు లాభం కలిగించేందుకే కేంద్ర బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్చిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మహేశ్ ఆరోపించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రైతులు వ్యవసాయ కార్మిక సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో వేతన కోడ్, 2020లో పారిశ్రామిక సంబం ధాల కోడ్, సామాజిక భద్రతా కోడ్, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్‌లకు పార్లమెంట్‌లో ఆమోదం పొందిందన్నారు. ఐదేళ్లుగా వాటిని అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి ధైర్యం చాలలేదన్నారు. బీహార్‌లో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే లేబర్ కోడ్స్ అమలు చేసేందుకు కేంద్ర కార్మికశాఖ మంత్రి మాన్‌సూఖ్ మాండవ్య నాలుగు జీవోలను ప్రకటించా రన్నారు. లేబర్ కోడ్‌ల కారణంగా కార్మికవర్గం హక్కులను కోల్పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సాంబశివ, సిద్దిగాళ్ల శ్రీనివాసులు, రామాంజులు, రైతు సంఘం నాయకులు వంగిమళ్ల రంగారెడ్డి, భాగ్యలక్ష్మి, చెన్నయ్య, అక్బర్, ముబారక్, వేణుగోపాల్‌రెడ్డి, నరసింహులు, తిరుమల, దేవా, చల పతినాయుడు, జానకీ, రాధా తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట : కార్మిక చట్టాల రద్దు సరికాదంటూ బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మిక సంఘం నేతలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ కొత్త చట్టాలను రద్దు చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్, జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, జిల్లా అంగన్వాడీల సంఘం ఉపాధ్యక్షురాలు ఈశ్వరమ్మ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు లక్ష్మీదేవి, ప్రసాద్, ఎంవీ రమణ, రెడ్డయ్య, రమేష్, అంగన్వాడీ నాయకురాళ్లు అమరావతి, శివరంజని, మాధవి తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరులోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, నాయకులు నారాయణ, పెంచలయ్య, హరి నారా యణ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

రైల్వేకోడూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బి. శ్రీనివాసులు తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు ఎన్జీవో హోంలో కోడూరు ఎన్జీవో సంఘం కార్యదర్శి రవీంద్రవర్మ పదోన్నతిపై కడపకు బదిలీ కావడంతో ఆయన సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలన్నీ దశలవారీగా పరిష్కారమవుతాయన్నారు. అనంతరం కోడూరు ఎన్జీవో సంఘం కార్యదర్శిగా జయసూర్య ను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. సంఘం లో సంయుక్త కార్యదర్శిగా ఉన్న అనసూయ మ్మ పదవీ విరమణ చేయడంతో మనోజ్‌కుమార్ ను సంయుక్త కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

రైతులకు పంచ సూత్రాల సందేశం

రైల్వేకోడూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉద్యాన శాఖాధికారిణి సుభాషిణి ఆధ్వర్యంలో బావికాడపల్లె లో బుధవారం రైతులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు సూచించిన పంచ సూత్రాల సందేశాన్ని వివరించారు.ఉద్యాన శాఖ అధికారులు భాస్కర్, సునీల్, లోకేష్, ఉద్యాన సహాయకులు విష్ణురెడ్డి, ప్రవీణ్, ఉద్యాన రైతులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితే పదిలో మంచి ఫలితాలు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివితే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చునని ఎంఈవో చక్రేనాయక్ తెలిపారు. బుధవారం లక్కిరెడ్డిపల్లెలోని ఎస్సీ, బీసీ వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. హాస్టల్‌లో సరైన వసతులు లేవని, ట్రంకు పెట్టెలు కూడా సరిగ్గా లేవని, ట్యూటర్ లేకపోవడంతో ఎస్సీ హాస్టల్లో 10 మంది, బీసీ హాస్టల్‌లో 30 మంది విద్యార్థులు ప్రైవేటు క్లాసులకు వెళుతున్నామని విద్యార్థులు ఎంఈవో దృష్టికి తీసుకొచ్చారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించండి

● జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కే. సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఆవిష్కరణల రూపకర్త లుగా తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కే. సుబ్రమణ్యం అటల్ పాఠ శాలల ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. బుధ వారం పట్టణంలోని మాసాపేట జి ల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటల్ టింక రింగ్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాటా డారు. విద్యార్థుల్లోని నైపుణ్యాలను పెంపొందిం చేందుకే అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను స్థాపించారన్నారు. ఈ ప్రయోగశాలలోని పరికరాలను సక్రమంగా ఉపయోగిస్తే విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి తథ్యమ న్నారు. రాష్ట్ర సమగ్ర శిక్ష సహకారంతో అన్నమయ్య జిల్లాలోని 24 అటల్ టింకరింగ్ పాఠశాలల ప్రధానోపా ధ్యాయులకు, ఇన్‌చార్జి టీచర్లకు మూడు రోజులు పాటు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, జిల్లా రీసోర్స్ సభ్యులు వేణుగోపాల్‌రెడ్డి, సర్ఫుద్దీన్, హేమంత్, వెంటేశ్వర్లు, మనోహర్, అజయ్, సాయి, అటల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇన్‌చార్జి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈవో కే. సుబ్రమణ్యం

పక్కా గృహాలకు దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని నిరుపేదలు పక్కా గృహాలకోసం దరఖాస్తు చేసుకోవచ్చునని మార్కెట్ యార్డు చైర్మన్ షఫీనాయక్ తెలిరు. బుధవారం రెడ్డివారిపల్లె, లక్కిరెడ్డిపల్లెల్లో పర్యటించి నిరుపేదలను గుర్తించి వారికి ఇల్లు మంజూరు చేయించాని హౌసింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జనార్దన, డిజిటల్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి పూజలో ఎమ్మెల్యే శ్రీధర్


ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌ను సన్మానిస్తున్న భక్తులు

ఓబులవారిపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మంగంపేట, బలి జపల్లె ఆర్ఆర్-4 గ్రామంలో బుధవారం నిర్వహించిన అ య్యప్పస్వామి పడిపూజ 44వ వార్షికోత్సవంలో ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అరవశ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు ఎమ్మెల్యేతో పాటు ఏపీఎండీసీ సీపీవో గోపినాథ్, ఇతర అధికారులకు శాలువా కప్పి అయ్యప్పస్వామి ప్రసాదాలు అందజేశారు. టీడీపీ సీనియర్ నాయకులు కల్లా చలపతి, గల్లా శ్రీధర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ గుండయ్యకు టీడీపీ నేతల నివాళి

చిట్వేలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆవిర్భావం నుంచి టీడీపీకి సేవలందించిన కందుల గుండయ్యనాయుడు మృతి తీరనిలోటు అని రాష్ట్ర ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ చైర్మన్ కేకే చౌదరి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు, మాజీ ఎంపీపీ కట్టా గుండయ్య నాయుడు అన్నారు. బుధవారం వారు కందులవారిపల్లెకు చేరుకుని పార్థివదేహానికి తెలుగుదేశంపార్టీ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాలు రామాంజనేయులు, లాయర్ బాలాజీ, కాకర్ల నాగార్జున, అజయ్ బాబు, వెంకటేశ్‌రాజు, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు పెంచలయ్య, బాలకృష్ణ యాదవ్, పెంచల్‌రెడ్డి, శంకర్‌రాజు, టీడీపీ ముఖ్య నేతలు తదితరులు పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు మొక్కలే ఆధారం

రాయచోటి నేతాజీ సర్కిల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వాతావరణ కాలుష్యంతో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణంలో మొక్కలు విరివిగా పెంచడమే పరిష్కారమని, ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటి వాటిని సంరక్షించాలని వంద పడకల ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, అభివృద్ధి కమిటీ సభ్యుడు, లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ షేక్. మహమ్మద్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో సుమారు 30 మొక్కలు నాటారు. డాక్టర్ కోటేశ్వరి, డాక్టర్ శివ, స్టాఫ్‌నర్సులు, సిబ్బంది, అభివృద్ధి కమిటీ సభ్యులు లక్ష్మీదేవి, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

మా భూములకు హద్దులు చూపించండి

● డీఆర్వోకు మహిళల వినతి

ఒంటిమిట్ట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మా భూములకు హద్దులు చూపించి పాసుబుక్కులు మంజూరు చేయాలని మండలంలోని రాచగుడి పల్లె గ్రామానికి చెందిన మహిళలు బుధవారం మండల బీజేపీ అధ్యక్షుడు భానుప్రకాష్‌రాజు ఆధ్వర్యంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014లో ఏడో విడతలో 40 కుటుంబాలకు ఒక్కొక్కరికి 60 సెంట్లు చొప్పున ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇందుకు సంబంధించి 1బీలు కూడా తమ వద్ద ఉన్నాయన్నారు. ఈ భూములకు సంబంధించి ఇప్పటివరకు అధికారులు పాసుబుక్కులు మంజూరు చేయలేదన్నారు. దీంతో ఆయా భూములు ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. ఆక్రమణ యత్నాలను అడ్డుకున్న తమను బెదిరిస్తున్నారన్నారు. పలుమార్లు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదన్నారు.

ప్లాన్ అప్రూవల్ ఫీజులు ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి

రైల్వేకోడూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆన్‌లైన్ ద్వారానే ఇంటి ప్లాన్, పన్నులు చెల్లించాలని రైల్వేకోడూరు డిప్యూటీ ఎంపీడీవో హరిత తెలిపారు. బుధవారం కోడూరు పంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి ప్లాన్ అప్రూవల్‌కు ఆన్‌లైన్‌లోనే డబ్బు చెల్లించాలన్నారు. నిబంధనలను పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోడూరు పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కోడూరును తిరుపతి జిల్లాలో చేర్చండి

చిట్వేలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలపాలని రైతు నాయకుడు మలిశెట్టి జతిన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన వెంకటరాజుపల్లెలో విలేకరులతో మా ట్లాడుతూ మదనపల్లెను జిల్లా కేంద్రం చేసిన నేపథ్యంలో, రాజంపేటను జిల్లా కేంద్రంగా చేయాలని, అలా కాని పక్షంలో రైల్వేకోడూరు నియోజక వర్గాన్ని తిరుపతి జిల్లాలో చేర్చాలని మనవి చేశారు.

ఆర్థిక సాయం

సిద్దవటం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కడపలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పొట్టా శివ అనే కార్యకర్త కుటుంబానికి రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నేతలు ఆయనను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివాజి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా కొండా భాస్కర్‌రెడ్డి ప్రమాణస్వీకారం

రాయచోటిటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల పరిధిలోని కాటిమాయకుంటకు చెందిన టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కొండా భాస్కర్‌రెడ్డి బుధవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ టవర్స్‌లో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు సమక్షంలో ఏపీఐఐసీ డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. తనపైన నమ్మకంతో అవకాశం కల్పించిన సీఎం చంద్రాబునాయుడు, మంత్రులు నారా లోకేశ్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ఒంటిమిట్ట మండల సమావేశం

ఒంటిమిట్ట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 28న ఒంటిమిట్ట మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుజాతమ్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు తాము చేసిన అభివృద్ధి పనులను వివరిస్తారన్నారు. కావున మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశానికి తప్పక హాజరు కావాలన్నారు.

విద్యార్థులకు రవాణా భత్యం

● ప్రభుత్వ బడుల్లో హాజరు పెంచడమే లక్ష్యం

● 3039 మంది విద్యార్థులకు రూ.91.17 లక్షలు విడుదల

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ బడుల్లో చదివే పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థుల రవాణా సౌలభ్యం కోసం ప్రభుత్వం 3039 మంది విద్యార్థులకు రూ.91.17 లక్షలు తొలి విడత సోమవారం విడుదల చేసింది. ఈ నిధులు విద్యార్థుల తల్లుల ఖాతాకు జమ అవుతాయి. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నిరంతరం చదువుకు ఈ పథకం ఎంతో దోహదపడుతుంది. గ్రామీణ ప్రాంత వెనుకబడిన, కుటుంబాల విద్యార్థుల ఆర్థిక పరిస్థితుల కారణంగా బడులకు దూరంగా ఉండేవారు. డ్రాపౌట్స్‌ను తిరిగి బడుల్లో చేర్పించేలా, ప్రభుత్వ బడుల్లో హాజరును పెంచేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. దీంతో విద్యార్థులకు రవాణా ఖర్చులు తగ్గి నిరంతరం చదువుకునేందుకు కూటమి ప్రభుత్వం చక్కటి అవకాశాన్ని కల్పించింది. తల్లికి వందనం, ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ ఇలా ప్రతి ఒక్కటి కల్పిస్తూ విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎన్నో పథకాలను తీసుకువస్తోంది.




ఆటోలో పాఠశాలకు వస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

రవాణా భత్యం... నిబంధనలు


గ్రామీణ ప్రాంతంలో పేద, వెనుకబడిన విద్యార్థులై ఉండాలి. 5వ తరగతి లోపు విద్యార్థులు ఒక కిలోమీటర్ పరిధిలో ఉన్న వారికి వర్తిస్తుంది. 6, 7, 8వ తరగతి విద్యార్థులకు 3 కిలోమీటర్ల లోపు ఉన్న వారికి వర్తిస్తుంది. 9, 10 విద్యార్థులు 5 కిలోమీటర్ల లోపు ఉన్న వారికి వర్తిస్తుంది. అయితే వారికి విధించిన కిలోమీటర్ల పరిధిలో మధ్యలో ప్రభుత్వ బడి ఉండరాదు. ఈ నిబంధనల ప్రకారం ఒక విద్యార్థికి 6 వేల రూపాయలు రవాణా భత్యం కింద మంజూరు చేసింది.

తొలి విడతలో జిల్లాలో 3039 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 3 వేల రూపాయలు చొప్పున వారి తల్లుల ఖాతాకు జమ చేశారు. పాఠశాలకు విద్యార్థులు స్థానిక ఆటోల సహకారంతో పాఠశాలకు వస్తున్నారు. ప్రభుత్వ బడులను నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో ఉత్తమ బోధనలను అందిస్తూ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తున్నారు. సంబేపల్లె మండలంలో సుమారు 18 పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుంది. ప్రాథమిక పాఠశాలలతో పాటు హైస్కూల్ చదివే విద్యార్థులు ఈ సౌకర్యాన్ని పొందుతున్నారు.



సంబేపల్లె మండలం వల్లంగడ్డ పాపన్నగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు



విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సూచనలు, సలహాలతో విద్యా వ్యవస్థలో సూచనలు, సలహాలతో విద్యా వ్యవస్థలో నూతన మార్పులను తీసుకొచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు చదువు కోసం తల్లికి వందనం, రవాణా సౌకర్యాలను నిధులు కేటాయింపు వంటి పథకాలతో ప్రోత్సహిస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పేద విద్యార్థులకు విద్యను అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. పేద విద్యార్థులు ఇలాంటి పథకాలను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకొని భవిష్యత్తులో వారి ఆశయాలను నేరవేర్చుకోవాలి.

- నల్లమల రామాంజులు, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా సభ్యుడు, రాయచోటి

ప్రభుత్వ బడుల బలోపేతం



గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపే విద్యార్థులు ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ఉత్తమ విద్యా బోధన వివిధ సంక్షేమ పథకాలతో ప్రభుత్వ బడుల వైపు ఆకర్షితులవుతున్నారు. ప్రతి తరగతిలో హాజరు సంఖ్య పెరిగింది. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను పొందడం ప్రభుత్వ పాఠశాలలకే సాధ్యం.

- కొండూరు మురళీమోహన్‌రాజు, ఉపాధ్యాయుడు, రాయచోటి

'రైతన్నా.. మీకోసం' సబ్‌కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



రైతన్నా..మీకోసం కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ భావన

నందలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆడపూరు గ్రామంలో జరుగుతున్న రైతన్నా... మీకోసం కార్యక్రమాన్ని రాజంపేట సబ్‌కలెక్టర్ ఎస్.భావన బుదవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆమె కార్యక్రమం జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులు ఏయే పంటలు సాగు చేస్తున్నారు, దాంట్లో ఎలాంటి మద్దతు ధర లభిస్తుంది అనే విషయాల గురించి రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, మండల వ్యవసాయాధికారి మల్లికార్జున, మార్కెట్‌యార్డు డైరెక్టర్ సుబ్బయ్య, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అరటి రైతులు అధైర్య పడవద్దు

జిల్లా ఉద్యాన అధికారి సుభాషిణి



పంటలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి సుభాషిణి

రాజంపేట టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాబోవు రోజుల్లో అరటి సాగు చేసిన రైతులు లాభాలు కళ్లజూస్తారని, ఆర్థిక సమస్యలు తొలగుతాయని, అంతవరకూ రైతులు అధైర్యానికి లోనుకావద్దని జిల్లా ఉద్యాన అధికారి సుభాషిణి తెలిపారు. బుధవారం ఆమె రాజంపేట మండలంలోని వరదయ్యగారిపల్లె, పుల్లంపేట మండలంలోని బావికాడపల్లెలో అరటి తోటలను పరిశీలించారు. ప్రస్తుతం 300 నుంచి 500 ఎకరాల్లో పంట 15 రోజుల్లో కోత దశకు చేరుతుందన్నారు. డిసెంబరులో కడప, అన్నమయ్య, అనంతపురం, నంద్యాల జిల్లాల ఉద్యాన అధికారులు అరటిపంట ఎగుమతిదారులతో చర్చలు జరిపి అరటికి సరైన ధర లభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఉద్యాన అధికారి సునీల్, రైల్వేకోడూరు ఉద్యాన అదికారి భాస్కర్, చిట్వేలి ఉద్యాన అదికారి లోకేష్, ఉద్యాన సహాయకులు విష్ణురెడ్డి, ప్రవీణ్, ఉద్యాన రైతులు పాల్గొన్నారు.

అయోమయానికి గురి చేస్తున్నారు : తులసిరెడ్డి

రాజంపేట టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల పునర్వవస్థీకరణ పేరుతో కూటమి ప్రభుత్వం అన్నమయ్య జిల్లా ప్రజలను అయోమయానికి గురి చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ఆరోపించారు. బుధవారం పట్టణంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా నుంచి మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, నియోజకవర్గాలను విడగొట్టి మదనపల్లె జిల్లాలో చేర్చారన్నారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి నియోజకవర్గాలు మాత్రమే ఉంటాయని, వీటితోనే అన్నమయ్య జిల్లాను కొనసాగిస్తారా.. లేక వేరే నియోజకవర్గాలు కలుపుతారా అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూల భాస్కర్, రాజంపేట పట్టణ కమిటీ అధ్యక్షుడు నరేశ్, రాజంపేట మండల శాఖల అధ్యక్షులు మహదేవయ్య, శివ, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉందాం... వైసీపీకి మన సత్తా చూపుదాం

● ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్, ప్రత్యేక పరిశీలకుడు నాగరాజు



ములకలచెరువులో మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్, ప్రత్యేక పరిశీలకుడు పూల నాగరాజు

ములకలచెరువు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులందరూ ఐక్యంగా ఉండి... వైసీపీకి మన సత్తా చూపుదామని ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్, నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకుడు పూల నాగరాజు, నియోజకవర్గ పరిశీలకుడు దినేశ్‌రెడ్డిలు అన్నారు. స్థానిక కేజీఎన్ కల్యాణమండపంలో బుధవారం జరిగిన మండల టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా ఉండి పార్టీని బలోపేతం చేయాలన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల్లో కూటమి గెలిచే విధంగా కష్టపడి పనిచేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ యువ నేత కట్టా దొరస్వామినాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, సింగిల్ విండో అధ్యక్షుడు గుత్తికొండ త్యాగరాజు, మండల పరిశీలకుడు రెడ్డిశేఖర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబాబు, నేతలు ఎర్రగుడి సురేష్, కేవీ రమణ, చెన్నకిష్టా, వెంకటస్వామి, ముత్తుకూరు మౌళా, సుధాకర్‌నాయుడు, మూగి రవిచంద్ర, నాగరాజుయాద్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం

పెద్దతిప్పసముద్రం నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని తంబళ్లపల్లె నియోజకవర్గ పరిశీలకుడు పోలంరెడ్డి దినేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం కుమ్మరవాండ్లపల్లె సమీపంలోని విజయగణపతి కల్యాణ మండపంలో టీడీపీ మండల కమిటీ ఎన్నిక ప్రక్రియ సమావేశంలో ఆయన మాట్లాడారు. టి.సదుం పంచాయతీలో టీడీపీకి ఎదురులేని మెజారిటీ కోసం అలుపెరుగని కృషి చేసిన ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనాథ్‌రెడ్డిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మండలంలోని వివిధ గ్రామాల టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జనార్దన్‌రావే నిధులు సమకూర్చాడు

● విచారణలో వెల్లడించిన కట్టా రాజు, బాలాజీ



తంబళ్లపల్లె ప్రభుత్వాస్పత్రిలో నిందితులు

ములకలచెరువు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ వ్యవహారంలో ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు కీలకమని, నకిలీ మద్యం తయారికి మొత్తం పెట్టుబడి ఆయనే పెట్టాడని కీలక నిందితులు కట్టా రాజు, బాలాజీలు విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. ములకలచెరువు నకిలీ మద్యం కేసులో నిందితులైన కట్టా రాజు, కొడాలి శ్రీనివాసరావు, బాలాజీ, సుదర్శన్, డ్రైవర్ ఆష్రఫ్, చైతన్యబాబులను మూడు రోజుల పాటు కస్టడీకి ఇస్తూ తంబళ్లపల్లె కోర్టు ఈనెల 24వ తేదీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో బుధవారం నాటితో కస్టడీ ముగిసింది. నిందితులను మూడు రోజుల పాటు విచారించిన ఎక్సైజ్ పోలీసులు కీలక విషయాలు రాబట్టారు. నిందితులను కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి విచారించారు. నకిలీ మద్యం తయారికి సంబంధించి అంశాలు, ఆర్థిక లావాదేవిలు, బెల్ట్‌షాపులకు సరఫరా, బెల్ట్‌షాపుల నుంచి నగదు వసూళ్లు, స్పిరిట్ సరఫరా, పాత్ర, సూత్రధారుల గురించి కట్టా రాజు, బాలాజీలను ప్రశ్నించి సమాచారాన్ని రాబట్టారు. కస్టడీ సమయం ముగియడంతో ఐదుగురు నిందితులను వైద్య పరీక్షల అనంతరం మదనపల్లె సబ్‌జైలుకు, కట్టా రాజును నెల్లూరు సెంట్రల్ జైలుకు తీసుకెళ్లారు.

జనార్దన్‌రావు.. పీటీ వారెంట్‌కు అనుమతి

ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లె జనార్దన్‌రావును ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరచనున్నారు. ఇబ్రహీంపట్నం కేసులో అరెస్టయి నెల్లూరు జైలులో ఉన్న జనార్దన్‌రావు, అతడి తమ్ముడు జగన్‌మోహన్‌రావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, రమేశ్‌బాబు, అల్లాబక్షులను ములకలచెరువు కేసులో అరెస్టు చూపేందుకు అనుమతి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు. దీంతో ఐదుగురిని ఈనెల 30వ తేదీలోగా హాజరుపరచాలని కోర్టు ఆదేశించింది. దీంతో అద్దేపల్లి జనార్ధన్‌రావుతో పాటు ఐదుగురు నిందితులను నెల్లూరు జైలు నుంచి తంబళ్లపల్లె కోర్టుకు తీసుకురానున్నారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి చర్యలు

గాలివీడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురాతన ఆలయాల అభివృద్ధికి దేవదాయ, ధర్మదాయ(శాఖ చర్యలు తీసుకుంటుందని ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శివయ్య తెలిపారు. బుధవారం నూలివీడు దేవరకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, అరవీడు దొన కొండ గంగమ్మ దేవాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన దేవాలయాలను రిజిస్ట్రేషన్, పబ్లికేషన్ చేసేందుకు దేవదాయ శాఖ సత్వర చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం ఆయన మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో పురాతన ఆలయాలను పరిశీలించి ఆలయాల స్థితిగతులను, అర్చకులు, గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు.

ఆ.. అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దయ్యేనా...?

● మాకు న్యాయం చేయాలంటూ బాధితుల ఫిర్యాదు

● చర్యలు తీసుకుంటామన్న డీఐజీ హామీపై ఆశలు

బి.కొత్తకోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన తప్పుడు రిజిస్ట్రేషన్‌లు రద్దు అవుతాయా? బాధితులకు న్యాయం జరుగుతుందా? అక్రమాలకు పాల్పడిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారా? ప్రస్తుతం బి.కొత్తకోట ప్రజలకు, అధికారులకు నివృత్తికాని అనుమానాలివి. న్యాయపరంగా తమకు హక్కు ఉన్న భూములను బి.కొత్తకోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇతరుల పేరున అక్రమంగా రిజిస్టర్ చేసేశారని, ఈ అన్యాయంపై ఎంత న్యాయపోరాటం చేసినా తమకు న్యాయం జరగలేదని పలువురు బాధితులు చేస్తున్న వాదన ఇంతకాలం అరణ్యరోదనగానే మిగిలింది. ఈనెల 24 రిజిస్ట్రేషన్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ (డీఐజీ) రామలక్ష్మీ పట్నాయక్ బి.కొత్తకోటకు చేరుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాల ఆరోపణలపై విచారణ చేపట్టడం, బాధితుల ఆక్రందనలు వినడం, లిఖితపూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించడం, వాటిపై సమగ్రంగా విచారించి న్యాయం చేస్తామని హామీ నివ్వడంతో ఆశలు చిగురించాయని ఫిర్యాదులు చేసిన బాధితులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

● బి.కొత్తకోట సబ్‌రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ మొత్తంలో 1 శాతం లంచంగా తీసుకుంటున్నారని, స్టాంప్‌రైటర్లు ఇష్టారాజ్యంగా కార్యాలయ సిబ్బందిని తమ చెప్పుచేతల్లో పెట్టుకొని, రైతుల సొమ్ము దోచుకుంటున్నారన్న ఫిర్యాదుల మేరకు విచారణకు వచ్చిన డీఐజీ రామలక్ష్మీపట్నాయక్‌కు విస్తుపోయే సాక్ష్యాలు, ఆధారాలు దొరికాయి. కార్యాలయ అవినీతిపై బహిరంగంగా జనం ఏకరువు పెట్టారు. చిన్నపాటి మొత్తాలే కాకుండా ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు, వివాదాస్పద స్థలాల విషయంలో ఏకపక్ష నిర్ణయాలతో రిజిస్ట్రేషన్లు చేసినందుకు రూ.లక్షలు చేతులు మారినట్లు డీఐజీకి ఆరోపణలు వచ్చాయి. ఈ సందర్భంగా డాక్యుమెంట్ల జిరాక్స్‌లతో పాటు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు ఇవ్వాలన్న ఆమె ఆదేశాల మేరకు పలువురు అర్జీలు సమర్పించారు. వాటిలో కొన్ని...



డీఐజీ రామలక్ష్మీ పట్నాయక్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

● బి.కొత్తకోట మండలంలోని బీరంగి పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 865-1ఏలో 1.66 ఎకరాల భూమికి సంబంధించి తన తండ్రి వి.ప్రభాకర్‌రావు పేరున పట్టాదార్ పాస్‌బుక్, మాన్యువల్1బి, అడంగల్, అనుభవ సర్టిఫికెట్, సబ్ డివిజన్ స్కెచ్, ఆర్‌హెచ్ నకలు ఉన్నాయని, తన తండ్రి 2012లో చనిపోతే 2013లో శ్రీనివాసులు, మరో ఇద్దరు చేరి ఈ భూమిని ఇతరులకు రిజిస్టర్ చేసిచ్చారని ఇది అక్రమం అని బి.కొత్తకోటకు చెందిన వి.మంజునాథ్ పిర్యాదు చేశారు.

● బి.కొత్తకోట మండలం గ్రామలెక్క దాఖలా సర్వే నెంబరు-309ఏ, తమకు రిజిస్టర్ డాక్యుమెంట్ ఉన్న భూమిని ఇతరుల పేరిట చేసిన రిజిస్ట్రేషన్ అక్రమమని, తమకు కోర్టు జడ్జిమెంట్, ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నా న్యాయం జరగలేదని, దానిని రద్దు పరచాలని బి.కొత్తకోట దర్గావీదికి చెందిన జేయస్ అస్లంబాషా డీఐజీకి పిర్యాదు చేశారు.

● బి.కొత్తకోట పట్టణంలోని సర్వే నెంబర్లు-337, 338, 339లలో విక్రయం ద్వారా డాక్యుమెంట్ నెంబరు-3186-1958 ప్రకారం తన తండ్రి బి.ఖాశింసాబ్‌కు సంక్రమించిన భూమిని ఇతరులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, దానిని రద్దు పరచాలని పట్టణంలోని సింహం వీధికి చెందిన బి.సయ్యద్‌సాబ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

కాగా ఇలాంటి ఫిర్యాదులతో పాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తమ విచారణలో తేలిన అంశాలపై రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్‌కు నివేదిక సమర్పించారని తెలుస్తోంది. చర్యలు ఏ మేరకు ఉంటాయో ముందు తెలియనుంది.

పారదర్శకంగా నిర్వహించాలి

రైతన్నా.. మీకోసంలో సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి



మేకలవాండ్లపల్లెలో రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

మదనపల్లె టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి సూచించారు. బుధవారం మదనపల్లె మండలం మేకలవాండ్లపల్లె నిర్వహిస్తున్న రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని సబ్‌కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ రైతులు సర్వసాధారణంగా మెట్టభూముల్లో వేసే వరి పంటకు బదులు ప్రత్యామ్నయ పంటలు సాగు చేయాలన్నారు. ఉద్యాన పంటల సాటుకు తప్పనిసరిగా డ్రిప్ విధానంతో నీటిని అందించాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రీయ ఎరువులను ఉపయోగించాలన్నారు. ఒక్కోసారి పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదని రైతులు సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకురాగా... రైతులే ఎఫ్‌పీవోలను ఏర్పాటు చేసుకుంటే వాటిని ప్రోత్సహిస్తామని రైతుల వద్దకే వ్యాపారులు వచ్చి పంట కొనుగోలు చేసేలా రైతులకు గిట్టుబాటు ధరలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. మిగిలిన మూడు రోజుల్లో రైతన్నా మీకోసం కార్యక్రమ లక్ష్యాలను చేరుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నవీన్‌కుమార్, వీహెచ్‌ఏ, రైతులు పాల్గొన్నారు.

వరి పంటపై అడవి పందుల దాడి



పందులు ధ్వంసం చేసిన పంటను చూపుతున్న రైతు

సుండుపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోతకు వచ్చిన వరి పొలాల్లో అడవి పందులు దాడి చేసి తీవ్రంగా నష్టపరిచాయని రైతు రామాంజుల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని భాగంపల్లి సమీపంలో తాను సాగు చేసిన రెండు ఎకరాల వరి పొలంలో మంగళవారం రాత్రి అడవి పందులు దాడి చేసి నష్టపరిచాయని తెలిపారు. పంట సాగుకు రూ.60 వేలు ఖర్చు చేశానని, వారం రోజుల్లో కోయాల్సి ఉండగా 70 శాతం పంటను పందులు నాశనం చేశాయని, ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరారు.

ఎఫ్‌పీవోల ద్వారా మార్కెటింగ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ మాస్ సీఈవో సీఎస్ రెడ్డి

పీలేరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మామిడి పంటను రైతు ఉత్పత్తిదారుల సంఘాల(ఎఫ్‌పీఓలు) ద్వారా మార్కెటింగ్ చేసుకోవాలని పీలేరులోని ఏపీ మాస్ సంస్థ సీఈవో సీఎస్ రెడ్డి రైతులకు సూచించారు. వచ్చే సీజన్‌లో మామిడి మార్కెటింగ్‌కు అవలంబించాల్సిన పద్ధతులపై బుధవారం పీలేరు ఏఎంసీ ప్రాంగణంలో రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ ఉత్పత్తులకు మెరుగైన ధరలు రావడానికి రైతులు సంస్థాగతంగా, శాస్త్రీయంగా, సమన్వయంగా పనిచేయాలన్నారు. పీలేరు ఏఎంసీ ఛైర్మన్ పురం రామ్మూర్తి మాట్లాడుతూ వచ్చే సీజన్‌లో మార్కెట్ కమిటీ ఆవరణలోనే రైతులకు అన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం రైతులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ మాస్ మేనేజర్ డాక్టర్ భార్గవి, ఏఎంసీ సభ్యులు కలప రవి, గొల్ల కిశోర్ నాయుడు, రహంతుల్లా, ఏపీ మాస్ పాలకవర్గ సభ్యులు సహదేవరెడ్డి, బోదేషావలి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్క్వాయ్ పోటీల్లో బంగారు పతకం



మజహర్ అలీని అభినందిస్తున్న దృశ్యం

మదనపల్లె టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్క్వాయ్ పోటీల్లో మదనపల్లె వాసి మజహర్ అలీ బంగారు పతకం సాధించాడని శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 24, 25 తేదీల్లో నంద్యాలలో నిర్వహించిన 8వ రాష్ట్ర స్థాయి స్క్వాయ్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి మజహర్ అలీ పాల్గొన్నాడన్నారు. ఈ పోటీల్లో అద్భుత ప్రతిభ కనపరచి బంగారు పతకం సాధించాడన్నారు. ప్రిన్సిపాల్ రమాదేవి, పీడీలు శరత్, జగదీష్ అభినందించారు.

కళాశాల భూమి కబ్జాపై ఫిర్యాదు

కలికిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలకు కేటాయించిన భూమిని కబ్జా చేశారని కళాశాల యాజమాన్యం బుధవారం తహసీల్దారుకు ఫిర్యాదు చేసింది. ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి తరపున కళాశాల అధికారులు ఈ మేరకు తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. 2009లో ప్రభుత్వం ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల కోసం 49.18 ఎకరాలు కేటాయించారని, ఆ తరువాత అందులో నుంచి 7 ఎకరాలు సైనిక్ స్కూల్‌కు పోగా ఇటీవల జాతీయ రహదారి విస్తరణ కోసం మరో 4.4.6 ఎకరాలు తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందులో భాగంగా 598 సర్వే నెంబరులో ఉన్న 6.01 ఎకరాల్లో కొంతభాగం ఒక వ్యక్తి ఆక్రమించుకున్నాడని, దీనిపై కళాశాల సిబ్బంది ఆక్రమణదారుడిని అడ్డుకునేందుకు ప్రయత్నించినట్లు వివరించారు. సర్వే నెంబరు-598కి బదులు రీసర్వేలో కేటాయించిన ఎల్‌పీఎం నెంబర్లు తప్పులతడకగా ఉన్నాయని, వాటిని సరిదిద్ది ఒరిజినల్ ఎల్‌పీఎం 2600ను సబ్ డివిజన్ చేయించాలని కోరారు. దీనిపై విచారణ చేసి ఆక్రమిత భూమిని గుర్తించి నివేదించాల్సిందిగా మండల సర్వేయర్‌ను తహసీల్దారు ఆదేశించారు. అనధికారిక సమాచారం మేరకు కళాశాలకు కేటాయించిన భూమిలో ఒక ఎకరాను కబ్జా చేసి విక్రయాలు కూడా జరిపారని చెబుతున్నారు. దీనికోసం మూడేళ్ల కిందట రెవెన్యూ అధికారులే రికార్డులను తారుమారు చేసి కబ్జాదారుడి పేరుతో భూమి బదలాయించినట్లు సమాచారం. ప్రస్తుత అధికారులు మొత్తం వ్యవహారంపై కూపీ లాగుతున్నట్లు చెబుతున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్

వల్లూరు/కమలాపురం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పంచ సూత్రాలు, సాగు విధానంలో తీసుకువస్తున్న వినూత్న మార్పులపై రైతులకు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా వ్యవసాయధికారి చంద్రనాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు శ్రేయస్సు కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా మూడో రోజు బుధవారం జిల్లాలోని వల్లూరు మండలం తోళ్లగంగన పల్లెలో రైతుల ఇంటికి వెళ్లి రైతు సంక్షేమ కార్యక్రమాలపై రాష్ట్రప్రభుత్వం ప్రచురించిన కరపత్రాలను ఆయన రైతులకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభతఉ్వం రైతుల కోసం అనేక రైతు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమం ద్వారా 3వ రోజుకు చేరకుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 1,20,932 మంది రైతు కుటుంబాలను సందర్శించడం జరగిందన్నారు. అన్నదాత సుఖీభవ, సబ్సిడీ విత్తనాల పంపిణీ తదితర అంశాలతో పాటు ప్రస్తుత రబీ సీజన్‌లో ఎదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలన్న అంశాలపై రైతులతో చర్చించారు. నర్సరీల ఏర్పాటు, సబ్సిడీలు, మైక్రో ఇరిగేషన్ పథకాలు కోల్డ్ స్టోరేజీ ఏర్పాటుకు సహకారం వంటి చర్యలతో ఉద్యానవన శాఖ రైతులకు అండగా నిలుస్తుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఉద్యానపంటలకు ఉన్న భారీ డిమాండ్లను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎగుమ తుల అవకాశాలను కూడా అందిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా పంచ సూత్రాల ద్వారా రైతులకు మేలు చేసే కార్యక్రమాలపై ఈనెల 29 వరకు ప్రతి రైతు ఇంటికి అధికారులు, ప్రజాప్రతి నిధులు వచ్చి రైతులకు అవగాహన పెంచుతారన్నారు. రైతు సేవాకేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అనుబంధశాఖల అధికారులు పాల్గన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్

సబ్సిడీతో డ్రిప్ పరికరాలు

ఏపీఎంఐపీ స్కీం ద్వారా ఎస్సీ ఎస్టీ రైతులకు డ్రిప్ పరికరాలను వంద శాతం సబ్సిడీతో, మిగతా రైతులకు 90 శాతంతో డ్రిప్ పరికరాలను అందిస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. బుధవారం కమలాపురం మండల పరిధిలోని నల్లింగాయపల్లెలో నిర్వహిస్తున్న రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రసాయనిక మందులు, ఎరు వులను తగ్గించి వాడాలన్నారు. కార్యక్రమంలో వల్లూరు మండల వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి, కమలాపురం గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఆకిషా, రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంచ సూత్రాల అమలుతో రైతుల ఆర్థికాభివృద్ధి

● జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటిటౌన్/నేతాజీసర్కిల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలోని పంచ సూత్రాల అమలుతో రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంచ సూత్రాల అమలు, అవగాహన కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రాయచోటి మండలం ఇందుకూరుపల్లిలో జరుగుతున్న పంచసూత్రాల అవగాహన కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతన్న మీకోసం కార్యక్రమంలో పంచ సూత్రాలపై అవగాహన, పాడి పశువుల పెంపకం, ఎరువుల వాడకాన్ని తగ్గించడం, తృణ ధాన్యాల వైపు రైతులను మళ్లించడంపై రైతులందరికీ అవగాహన కల్పిస్తున్నారన్నారు. అలాగే సంబేపల్లె మండలం మోటకట్లలో జరుగుతున్న పంచసూత్రాల అవగాహన కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. రైతుసేవ కేంద్రాల్లో ఎరువులు అందుతున్నాయా అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసా యశాఖ అధికారి శివనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతన్నా మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో రన్నర్స్‌గా కస్తూర్బా విద్యార్థినులు

కలసపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ పోటీల్లో జాతీయ స్థాయిలో తమ పాఠశాల విద్యార్థినులు రన్నర్స్‌గా నిలిచినట్లు పెండ్లిమర్రి కస్తూర్బా ప్రిన్సిపాల్ రెడ్డిజ్యోతి తెలిపారు. ఇటీవల జాతీయస్థాయి కబడ్డీ అండర్-19లో పోటీల్లో ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలకు గుర్తింపు తెచ్చిన విద్యార్థినులు కళ్యాణి, షఫియా, మంజుల, శృతి, మహేశ్వరి, సుమాంజలి, నిహారిక, కీర్తి, శిరీష, అమరావతి, కీర్తనలతో పాటు వ్యాయామ ఉపాధ్యాయురాలు వాణిలను ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.



జాతీయస్థాయిలో రాణించిన కస్తూర్బా విద్యార్థినులు

విజయవంతంగా ముగిసిన క్రీడాపోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ జి.రామచంద్రరావు, డాక్టర్ ఎం.మాధవ

పులివెందుల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పులివెందుల ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన అంతర్‌కళాశాలల క్రీడలు, ఆటలు, సాంస్కృతిక, సాహిత్య పోటీలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. ఈసందర్భంగా పులివెందుల ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల డీన్ డాక్టర్ ఎం.మాధవ మాట్లాడుతూ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపి తమ కళాశాల, విశ్వవిద్యాలయ ప్రతిష్టను పెంచారన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో 19 కళాశాలల విద్యార్థులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని సమస్యలకు పరిష్కారం చూపే ఏకైక గ్రంథం రాజ్యాంగం



రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్ని సమస్యలకు పరిష్కారం చూపే ఏకైక గ్రంథం మన రాజ్యాంగం అని వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ తెలిపారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం-2025ను ఘనంగా నిర్వహించారు. వీసీ రాజశేఖర్, ప్రముఖ అధ్యాపకులు, అతిథులు అంబేద్కర్ చిత్రపటం, విగ్రహానికి నివాళులు అర్పించారు.

అనంతరం జరిగిన సదస్సులో వీసీ మాట్లా డుతూ రాజ్యాంగం దేశానికి పవిత్ర గ్రంథమని, సమ స్యలన్నింటికీ రాజ్యాంగమే మార్గదర్శకమని పేర్కొన్నారు. విద్యార్థులు హక్కులతో పాటు బాధ్యతలు పాటించాలని సూచించారు. మాజీ డీఎస్ ప్రొఫెసర్ ఎం.చెన్నబసవయ్య రిజర్వేషన్ల తత్వం, రాజ్యాంగ అవగాహనపై విశ్లేషణాత్మక ఉపన్యాసం ఇచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ రాజ్యా ంగంలోని ముఖ్యాంశాలు వివరించగా, ప్రిన్సిపల్ టీ.శ్రీని వాస్ రాజ్యాంగాన్ని గౌరవిస్తే దేశం 2050 నాటికి మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. డీన్లు రాజ్యాంగ చారిత్రక నేపథ్యం, అంబేద్కర్ ఎదుర్కొన్న కష్టాలు, సమాజంలో ఇంకా కొనసాగుతున్న కుల అంతరాలపై మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. రాజ్యాంగ ప్రియాంబుల్ ప్రదర్శిస్తూ విద్యార్థుల ర్యాలీ నిర్వహించారు.

వినీత్‌కుమార్‌ది కారు ప్రమాదమే!



నిందితులతో కలిసి తీసిన ఫొటోను మీడియాకు విడుదల చేసిన పోలీసులు

కలికిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వినీత్‌కుమార్ రాజు మృతి కేసు మరింత వివాదాస్పద మలుపులు తిరుగుతోంది. వినీత్ మృతికి కారణం హత్య కాదని.. కేవలం కారు ప్రమాదమేనని పోలీసులు తేల్చేశారు. అయితే పోలీసు దర్యాప్తులో వెల్లడించిన అంశాలన్నీ మరిన్ని అనుమానాలకు దారి తీస్తున్నాయని చెపుతున్నారు. ఈ నెల 14న అర్ధరాత్రి వినీత్‌కుమార్ రాజు కారు ప్రమాదంలో మృతి చెంది సత్యాపురం వద్ద రోడ్డుపై పడివుండగా అందిన సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అంతకు ముందు జరిగిన సంఘటనల ఆధారంగా వినీత్ స్నేహితులైన అబుబాకర్, నౌషాద్ బాష, పాలగిరి అహ్మద్, మంద నరేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే తమ కుమారుడిని నలుగురు స్నేహితులు కొట్టి చంపి రోడ్డుపై పడేసి వెళ్లారని వినీత్ తల్లిదుండ్రులు ఆరోపించారు. ఆ మేరకు ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు తీసుకోలేదని ఆరోపిస్తూ పోలీసు స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. పెద్ద సంఖ్యలో వినీత్ కుటుంబీకులు, బంధువులు రెండు రోజులు ధర్నా కూడా చేశారు. ఎట్టకేలకు 16వ తేదీ వినీత్‌ది హత్య కేసుగా నమోదు చేశారు. కాకతాళీయంగానో లేదా ముందస్తు చర్యల కారణంగానో గానీ ఆ మరుసటి రోజే కేసు నమోదు చేసిన సీఐ అనిల్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆరోజు నుంచి పీలేరు సీఐ యుగంధర్ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. తాజాగా బుధవారం నిందితులు నలుగురినీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద అరెస్టు చేసినట్లు బుధవారం రాత్రి పోలీసులు ఒక ప్రెస్‌నోట్ కలికిరి పోలీసుల గ్రూపులో పెట్టారు. దీంతోపాటు పీలేరు సీఐ యుగంధర్, మరి కొందరు కలికిరి పోలీసులు నిందితులతో కలిపి తీయించిన ఫొటోను కూడా దీనికి జత చేశారు. పోలీసులు గ్రూప్‌లో పెట్టిన ప్రెస్‌నోట్ మేరకు వినీత్‌ది హత్య కాదని నిర్ధారించినట్లు పేర్కొన్నారు. మృతుడు వినీత్ సహా నిందితులు నలుగురూ తాగి వున్నారని తెలిపారు. నిందితుల్లో ఒక్కడైన నౌషాద్ కారుతో ఢీకొనగా వినీత్ మృతి చెందినట్లు పేర్కొన్నారు. అయితే కారుతో ఢీకొట్టిన అనంతరం నిందితులు కారును దాచిపెట్టారని, సాక్ష్యాధారాలను తారుమారు చేశారన్నారు. మృతుడి తల్లి ముంగర సుకన్య ఫిర్యాదు చేసినట్లు ఇది హత్య కాదని పోలీసులు తేల్చి చెప్పారు. ప్రెస్‌నోట్‌కు ముక్తాయింపుగా మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ఎదుటివారికి ప్రాణాపాయం సంభవించే అవకాశమున్నట్లు యువతకు ఒక సందేశాన్ని జత చేశారు. అసలు కేసును ఎవరు నమోదు చేశారు, ఎవరు దర్యాప్తు చేశారు అనే విషయాలను వెల్లడించలేదు. దీనిపై మీడియా గ్రూపులో వేసిన ప్రశ్నలకు కూడా పోలీసుల నుంచి సమాధానం లేదు. మొత్తం మీద అరెస్టు చేసిన వారిని గురువారం కోర్టులో హాజరుపరచనున్నట్లు మాత్రం సమాచారం. మొత్తానికి పోలీసుల ప్రెస్‌నోట్‌లో తగిన వివరాలు లేకపోగా అడిగినా చెప్పేవారు కూడా లేకపోవడంతో ఇది మరింత గందరగోళానికి గురిచేస్తోంది.

కేబుల్ కట్ చేసినందుకు కేసు నమోదు

కొండాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.కోడూరు వద్ద ఉన్న సోలార్ కంపెనీ కేబుల్ కట్ చేసినందుకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి అనే రైతు తన పొలాన్ని సోలార్ కంపెనీకి లీజుకు ఇచ్చాడు. దీనికి సంబంధించి లీజు ప్రకారం కంపెనీ డబ్బులు చెల్లించింది. కాగా ఈశ్వర్‌రెడ్డి తన పొలంలో సోలార్ కంపెనీ కేబుల్ వేస్తుండగా అడ్డుకున్నాడు. దీంతో ఆయన కంపెనీ ప్రతినిధులతో గొడవపడ్డాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ శివనాగిరెడ్డి తెలిపారు.

ఆకట్టుకున్న స్కౌట్స్ విద్యార్థుల వేషధారణలు



వివిధ వేషధారణలలో స్కౌట్ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రాజధాని లక్నోలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ కార్యాలయం వారు 19వ నేషనల్ జాంబోరీ, డైమండ్ జూబ్లీ జాంబోరీను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హాజరయ్యారు. రాష్ట్ర ఔన్నత్యాన్ని చాటి చెప్పే విధంగా శ్రీవెంకటేశ్వరస్వామి వేషధారణలో కడప జిల్లా స్కౌట్ మాస్టర్ జగదీష్, పద్మావతి అమ్మవారిగా సవిత్రశ్రీ, లక్ష్మీదేవి అమ్మవారి అవతారంలో సుమనశ్రీ, వీరబ్రహ్మేంద్రస్వామి వేషధారణలో వెంకటసుబ్బయ్య, సిద్దయ్య వేషధార ణలో అల్తాఫ్ జిల్లా గొప్పదనాన్ని, కీర్తిని దేశానికి చాటిచెప్పారు. కార్యక్రమంలో కడప జిల్లాకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ రేంజర్స్ అండ్ రోవర్స్ వివిధ పాల్గొని జయప్రదం చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



బోల్తాపడిన లారీ

వీరపునాయునిపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల-వీరపునాయునిపల్లె ప్రధాన రహదారిలోని పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న బ్రిడ్జి వద్ద బుధవారం తెల్లవారుజామున లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడింది. లారీలో ఉన్న డ్రైవర్ అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. బ్రిడ్జి వద్ద ఇరుపక్కల రక్షణగోడ లేకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని పలువురు భావిస్తున్నారు. కనీసం రేడియం స్టిక్కర్స్ ఉన్నా ప్రమాదం జరిగేది కాదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇరువైపుల రక్షణగోడ నిర్మించాలని కోరుతున్నారు.

సమర్థవంతమైన నాయకత్వం కోసం అభిప్రాయ సేకరణ

కడప కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంగ్రెస్ పార్టీని సమర్థవంతంగా నడిపించేందుకు నాయకత్వం కోసం ఆసక్తి గల నేతల నుంచి దరఖాస్తులు, అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు ఏఐసీసీ కో ఆర్డినేటర్, కన్యాకుమారి ఎంపీ విజయ వసంత్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంఘటన్ సుజన్ అభియాన్ కమిటీ జిల్లా పర్యటనలో భాగంగా డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతితో కలసి పాత్రికేయుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా విజయ్ వసంత్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ఏఐసీసీ ఆదేశాల మేరకు అన్ని జిల్లాల్లో ఎస్ఎస్ఏ కమిటీ పర్యటిస్తోందన్నారు. ఏఐసీసీ, పీసీసీతో పాటు జిల్లా నుంచి డీసీసీ అధ్యక్షులతో కూడిన ఐదుగురు బృందం పర్యటిస్తోందన్నారు. నియోజకవర్గాల వారీగా వచ్చే నెల 5వ తేదీ వరకు జిల్లా నాయకత్వం బలోపేతం చేసే ఆసక్తి ఉన్న నేతల నుంచి దరఖాస్తులతో పాటు అభిప్రాయ సేకరణ చేపట్టడం జరుగుతోందన్నారు. పార్టీ నాయకులు, అనుబంధ సంఘాలు, కార్యకర్తలు, ప్రజల అభీష్టం మేరకు జిల్లా నాయకత్వాన్ని ఎంపిక చేసేలా ఏఐసీసీ కమిటీకి సమర్పించిన దరఖాస్తులను పంపుతామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట సత్యనారాయణ, రాష్ట్ర జనరల్ సెక్రటరీ నరసింహులు, లీగల్ సెల్ చైర్మన్ సోమశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యిద్ గౌస్‌పీర్, నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు శివ మోహన్‌రెడ్డి, ధ్రువకుమార్, అశోక్‌రెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐసీసీ కోఆర్డినేటర్

విద్యుత్ షాక్... ఆవు మృతి



పెండ్లిమర్రి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉలవలపల్లె గ్రామ పంట పొలాల్లో బుధవారం రైతు బాల గురవయ్యకు చెందిన ఆవు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందింది. విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను కింద ఏర్పాటు చేయడంతో షాక్‌కు గురై ఆవు మృతి చెందిందని బాధిత రైతు తెలిపారు. దాదాపు రూ.50వేలు నష్టం వాటిల్లిందన్నారు. సంఘటనా స్థలాన్ని విద్యుత్ ఏఈ, పశువైద్యాధికారి పరిశీలించారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు



ఆర్.ఎన్. క్రిష్ణసాయి



వర్మ

కడప స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య సాగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు బుధవారం డ్రాగా ముగిశాయి. వివరాలిలా.. ఏసీఏ క్రికెట్ మైదానంలో నార్త్ జోన్ విన్నర్స్- సౌత్‌జోన్ విన్నర్స్ మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 276 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. తదుపరి రెండవ రోజున బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు 78.4 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో ఎస్.ఎం. ఇజహర్ 50 పరుగులు, రక్షన్‌సాయి 50 పరుగులు చేశారు. దీంతో నార్త్‌జోన్ విన్నర్స్ జట్టుకు 65 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 29 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్- రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్ మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 75.4 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 66 పరుగులు చేసింది. తిరిగి రెండో రోజు బ్యాటింగ్ చేపట్టి 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 337 పరుగుల భారీ స్కోర్ సాధిం చింది. ఇందులో వర్మ 110, ఎం.లికిత్ 71 పరుగులు చేశారు. దీంతో రెస్ట్‌ఆఫ్ సెంట్రల్‌జోన్‌కు 51 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. ఇదిలావుండగా రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టు బౌలర్ ఆర్.ఎన్.క్రిష్ణసాయికి 5 వికెట్లు లభించాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 112 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ విన్నర్స్- రెస్ట్‌ఆఫ్ సెంట్రల్‌జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటిం గ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 66.5 ఓవర్లలో 224 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. ఇందుకు ప్రతిగా సెంట్రల్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు 31 ఓవర్లలో 5 వికెట్లు కోల్పో యి 96 పరుగులు చేసింది. బుధవారం రెండో రోజు బ్యాటింగ్‌కు దిగి మొత్తం 51.5 ఓవర్లలో 147 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఇందులో తమన్‌సాయి 52 పరుగులు చేశారు. దీంతో రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్టుకు 77 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 62 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 177 పరుగులు చేసింది. ఇందులో కిన్నుకిశాల్ 77 పరుగులు చేయగా, సాయి క్రిష్ణచైతన్య 53 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

భారత రాజ్యాంగం చాలా గొప్పది

ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించిన సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ● 11వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో జిల్లా జడ్జి మహేశ్
● కదిరాయచెరువులో రాజ్యాంగ పీఠిక పలికిన విద్యార్థులు ● వాడవాడలా రాజ్యాంగ అమోద దినోత్సవం





సబ్‌కలెక్టరేట్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి - పీలేరు కోర్టులో రాజ్యాంగ పఠనం చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు - గుర్రంవాండ్లపల్లి హైస్కూల్‌లో విద్యార్థులు వేసిన రంగోలి

మదనపల్లె టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత రాజ్యాం చాలా గొప్పదని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి పేర్కొన్నారు. బుధవారం రాజ్యాంగం ఆమోదించిన దినోత్సవం సందర్భంగా సబ్ కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం భారత రాజ్యాంగాన్ని పాటిస్తామని ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయించారు. బీటీ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, మహిళా డిగ్రీ కళాశాలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి, జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో వేడుక చేశారు. ప్రిన్సిపాల్ రమాదేవి, ప్రొఫెసర్ రమ్య, దేవేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం సుబ్బారెడ్డి పర్యవేక్షణ లో దినోత్సవం నిర్వహించారు.

పీలేరు 11వ అదనపు జిల్లా కోర్టులో....

పీలేరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ ఆమోద దినోత్సవం పట్టణంలోని కోర్టులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాసంఘాలు ఘనంగా నిర్వహించాయి. ప్రజాసంఘాల నేతలు స్థానిక పంచాయతీ కార్యాలయ కూడలి వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో అంబేడ్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. నేతలు మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26న ఆమోదించగా 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చిందన్నారు. అప్పటి నుంచి ఏటా నవంబరు 26న రాజ్యాంగ ఆమోద దినోత్సవం చేసుకుంటున్నామన్నారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా పొందుపరచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పీలేరులోని 11వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో జిల్లా జడ్జి మహేశ్, పీజేసీజే జియావుద్దీన్ రాజ్యాంగ ప్రవేశిక సామూహిక పఠనం చేస్తూ రాజ్యాంగ పరిరక్షణకు తోడ్పాటందిస్తామని ప్రతిన బూనారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు శివకుమార్, ఎంపీడీఓ శివశంకర్ మాట్లాడారు. సంజయ్ గాంధీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు శ్రీనివాసులు రెడ్డి, వెంకట రమణయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బీసీ పురుషోత్తం రెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్, ప్రజా సంఘాల నేతలు పాలకుంట శ్రీనివాసులు, గట్టప్ప, రాజమ్మ, తుమ్మల ధరణీకుమార్, జెట్టి మల్లికార్జున, ముల్లంగి గురవయ్య, మల్లయ్య, రామ్మూర్తి, గోవర్దన్ రాజు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

కదిరాయచెరువు జడ్పీ హైస్కూల్లో....

కలకడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం కదిరాయచెరువు జడ్పీ హైస్కూల్లో విద్యార్థులతో రాజ్యాంగ పీఠికను పలికించారు. ప్రార్థన సమయంలో మాక్ అసెంబ్లీ ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రదర్శించారు. వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కారక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జె.శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు కరీముల్లా పాల్గొన్నారు.

బస్‌స్టాప్ వద్ద...

పెద్దమండ్యం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) మండలంలో భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరిగింది. బస్‌స్టాప్ వద్ద అబేండ్కర్ విగ్రహానికి ఎంఈఓలు మనోహర్, రామకృష్ణ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి రాజ్యాంగ ప్రతిష్టను తెలియజేశారు మండల కార్యాలయాలు, ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో రాజ్యాంగం ఆమోద దినోత్సవం నిర్వహించారు. వ్యాస రచన, రంగోళి, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పెద్దమండ్యం సహా గుర్రం వాండ్లపల్లి హైస్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవం ఉత్సాహంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, స్థానికులు చేసుకున్నారు.

బెంగళూరు రోడ్డులో...

మదనపల్లె, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మనం రాజ్యాంగాన్ని రక్షించుకుంటే, రాజ్యాంగం మనల్ని రక్షిస్తుందని బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్ అన్నారు. బెంగళూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బాస్, వీసీకే నేతలు సంయుక్తంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు. బి.టి.కళాశాలలోని ఠాగూర్ కాటేజీ వద్ద జిల్లా ప్రకటనపై సంబరాలు చేసుకున్నారు. బాస్ నేతలు ముత్యాల మోహన్, నీరుగట్టి రమణ, మంచూరి మారెప్ప, జి.గంగులప్ప, గంగాధర్, బండకోట రవి, రెడ్డిప్రసాద్, నారాయణ, శరత్‌కుమార్, అభి, తరుణ్, పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం పట్ల అవగాహన

వాల్మీకిపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ తప్పక అవగాహన కలిగి ఉండాలని వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వసుంధర పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులచే మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో ప్రస్తుత సమకాలీన అంశాలకు సంబంధిత ప్రశ్నోత్తరాల కార్యక్రమం అలరించింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, నాగరాజు, చెంగయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాణంలో...

మదనపల్లె అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం నిర్మాణంలో అంబేడ్కర్ పాత్ర కీలకమని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమల సుదర్శనం అన్నారు. అంబేడ్కర్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోతబోలురెడ్డెప్ప, నాయకులు చంద్రయ్య, గుండా మనోహర్, మల్లెల మోహన, రమణ, బాస్కర్, గంగాధర్ పాల్గొన్నారు. భారత రాజ్యాంగం అప్పట్లో అంబేడ్కర్ అన్ని వర్గాల అభ్యున్నతి కోసమే రచించారని తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆర్‌ఐ బాలసుబ్రహ్మణ్యం, సర్వేయర్ సుబ్రమణ్యం, వీఆర్వోలు పాల్గొన్నారు.

మదనపల్లె విద్యార్థికి కలెక్టర్‌చే అవార్డు

భారత రాజ్యాంగం ఆమోద దినోత్సవం పురస్కరించుకుని మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో విద్యార్థిని భవ్యశ్రీకి కలెక్టర్ నిశాంతకుమార్ అవార్డు అందించారు. వ్యాసరచన పోటీలో ప్రతిభ కనపరిచిన ఆరుగురి విద్యార్థులకు మాజీ డీజీపీ రాధాకృష్ణ నగదు బహుమతులను అందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో...

నిమ్మనపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠాశాలల్లో రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు హెచ్‌ఎం భాస్కరన్ మాట్లాడుతూ 1946 నవంబరు 26న భారత దేశ రాజ్యాంగాన్ని పూర్తి స్థాయిలో ఆమోదించాలన్నారు. డాక్టర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం బడుగు బలహీనవర్గాలు, అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకుని రాజ్యాంగాన్ని రూపొందిచారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి....

తంబళ్లపల్లె, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాలు చేశారు. ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం మొగిలీశ్వరయ్య, టీచర్ పద్మావతి రాజ్యాంగం ప్రాముఖ్యత వివరించారు.

'ఎన్‌ఐటీ ఇచినోసేకి' మిట్స్ విద్యార్థులు



జపాన్‌లోని ఎన్‌ఐటీ ఇచినోసేకి ఎంపికైన మిట్స్ విద్యార్థులు

కురబలకోట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జపాన్‌లోని అత్యంత ప్రతిష్టాత్మకమైన 'ఎన్‌ఐటీ ఇచినోసేకి' కళాశాలకు ఏడుగురు మిట్స్ విద్యార్థులు ఎంపికైనట్లు వీసీ సి.యువరాజ్ తెలిపారు. అంగళ్లు సమీపంలోని డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్శిటీ అధ్యాపకుడు వంశీ ఆధ్వర్యంలో విద్యార్థులు చెర్షితారెడ్డి, హేమ చరిత, అనికేత్ అరుణ్ సస్మాల్, లోకేష్, తేజశ్రీ, వైష్ణవి, తేజేశ్వర్‌రెడ్డి జపాన్‌లో జరిగిన సకురా సైన్స్ ఎక్స్చేంజ్ ప్రోగ్రామ్-2025లో పాల్గొన్నారు. ఈ సందర్శనలో కృత్రిమ మేధస్సు, ఎలక్ట్రిక్ అటానమస్ వెహికల్స్ ఇంటర్నేషనల్ కో క్రియేటివ్ ప్రాజెక్ట్ ఆధారంగా రోబోటిక్స్ ఎలక్ట్రికల్ వాహనాలు, సాంకేతిక అంశాలపై శిక్షణ పొందినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు మురకోమి గ్రూప్ పరిశ్రమను సందర్శించి ఆటోమోటివ్ రంగంలో జరుగుతున్న పరిశోధనలు, తయారీ విధానాలను తెలుసుకున్నారు. పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి కావాల్సిన అంశాలను తెలుసుకున్నారన్నారు. అనంతరం వ్యాపార సంస్థలు ఏర్పాటు చేయడానికి కావాల్సిన అంశాలను వివరించడం, తర్వాత వ్యాపార సంస్థలను ప్రారంభించడానికి కావాల్సిన అంశాలను ప్రతినిధుతో ముఖాముఖి ద్వారా అడిగి తెలుసుకున్నారు. విద్యా, పరిశోధనలు అవకాశాలను మెరుగుపరచుకోవడం, అత్యాధునిక సాంకేతికతలు మెరుగుపరచుకునేందుకు ఇలాంటి సదస్సు దోహదపడతాయన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చాన్సలర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ప్రో చాన్సలర్ ద్వారకనసాథ్, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ, యాజమాన్యం, వీసీ సి.యువరాజ్, ఇంటర్ నేషనల్ సెల్ సీనియర్ మేనేజర్ విజయలక్ష్మి, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

గోల్డెన్‌వ్యాలీలో 'దేవగుడి' బృందం సందడి

19న విడుదల : దర్శక,నిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి



డ్యాన్స్ చేస్తున్న హీరోహీరోయిన్

కురబలకోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'సొంతమనిషిలా ఆదరించండి, మీరు చూపే ఆదరాభిమానాలు జీవితంలో వెలకట్టలేనివని' దర్శక, నిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అంగళ్లు సమీపంలోని గోల్డెన్ వ్యాలీ ఇంజనీరింగ్ కళాశాలలో దేవగుడి సినిమా దర్శక, నిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి, హీరోహీరోయిన్లుగా అభినవ శౌర్య, అనుశ్రీ నటించిన చిత్రం యూనిట్ విద్యార్థులతో కలిసి ప్రమోషన్ చేశారు. ఈ సినిమాను డిసెంబరు 19న థియేటర్లలో రిలీజ్ చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ చూసి ఆదరించాలని కోరారు. అనంతరం చిత్ర సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఎస్.వి.రమణారెడ్డి, ప్రిన్సిపాల్ మనోహర్, రాజేష్, పీఆర్‌వో వీరు తదితరులు అభినందించారు.

'అన్నదాత సుఖీభవ'తో అర్హులకు న్యాయం

బి.కొత్తకోట, నవంబరు26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా అందిస్తున్న అన్నదాతా సుఖీభవ పథకం ద్వారా అర్హులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని టీడీపీ రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి మొటుకుశివ పేర్కొన్నారు. బుధవారం పార్టీ కార్యకర్తలతో కలిసి బి.కొత్తకోట మండలంలోని మొటుకు పంచాయతీ పరిధిలోని పలుగ్రామాల్లో ఆయన ఇంటింటికీ వెళ్లి పార్టీ కరపత్రా లను పంచిపెట్టారు. ఎవరికైనా అన్నదాతా సుఖీభవ పథకం నిధులు జమకాకపోతే వారి వివరాలు తీసుకుని, ఏ కారణంగా వారికి జమకాలేదో గుర్తించి, తగు చర్యలు తీసుకోవాలన్న ఆదేశాల మేరకు గ్రామాల్లో తిరిగి రైతుల తో మాట్లాడుతున్నామన్నారు. కార్యక్రమంలో నేతలు రఘుపతినాయుడు, బద్దులరెడ్డి, నరసింహులు, చంద్రన్న, మహేష్, శంకర తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రకటనపై సంబరాలు



వాల్మీకిపురంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న కూటమి పార్టీల నేతలు



ఎమ్మెల్యే షాజహాన్‌బాషకు అభినందనలు తెలుపుతున్న నాగూర్‌వలి

వాల్మీకిపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా కేంద్రం ప్రకటనపై బుధవారం వాల్మీకిపురంలో టీడీపీ నేతలు కేక్‌లు కట్ చేసి పంచి సంబరాలు చేసుకున్నారు. మన జిల్లా మదనపల్లె జిల్లా అంటూ నినాదాలు చేశారు. గాంధీ సర్కిల్‌లో పీలేరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత కంభం నిరంజన్‌రెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రమౌళి, మండల పార్టీ అధ్యక్షుడు ధాముురెడ్డి, తదితరులతో కలిసి కేక్ కట్ చేసి పంచి పెట్టారు. వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో మదనపల్లెను జిల్లాగా చేస్తామని సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రకటించారని నేడు ఆచరణ సాధ్యమైందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ సర్పంచి రాజేంద్రాచారి, బీజేపీ జిల్లా కార్యదర్శి పులి నరేంద్రకుమార్‌రెడ్డి, టీడీపీ నేతలు మాల్లికార్జునరెడ్డి, గాంధీపేట రమణ, బొక్కసం రామకృష్ణ, పీవీ మురళి, పీవీ నారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, సయ్యద్‌బాషా, జనసేన నేతలు ప్రభాకర్ పాల్గొన్నారు.

బస్‌స్టాండ్ కూడలి వద్ద...

కలకడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మదనపల్లి జిల్లా, పీలేరు రెవెన్యూ డివిజన్‌కు సీఎం ఆమోద ముద్ర పడడంతో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బస్‌స్టాండ్ కూడలి వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలకు పాలభిషేకం చేసి కేక్ కట్ చేశారు. సింగిల్‌విండో అధ్యక్షుడు మద్దిపట్ల వెంకటరమణనాయుడు, నేతలు పొత్తూరి ప్రభాకర్‌నాయుడు, లక్ష్మీప్రసన్న కమల్‌నాథ్, రైసుమిల్లు రమణ, ఇంజేటి తారకేశ్వర, నౌషద్, ఆనందరెడ్డి, పి.వి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు..

నిమ్మనపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మదనపల్లిని జిల్లా కేంద్రంగా ప్రకటించడంతో కూటమి నేతలు, ప్రజలు స్థానిక బస్‌స్టాండులో బాణసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ మండల అధ్యక్షుడు రాజన్న, అధికార ప్రతినిధి ఆర్వేవెంకటేష్ మాజీ జడ్పీటీసీ వసంత మునిరత్నం మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రెడ్డెప్పరెడ్డి, సర్పంచ్ రెడ్డెప్ప, మహ్మద్ రఫి, శ్రీపతి కూటమి నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

జిల్లా ప్రకటన హర్షణీయం

మదనపల్లె అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రకటన హర్షించదగ్గ విషయమని మదనపల్లె 1,2 ఆర్టీసీ డిపోల ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి అన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నేత షేక్ రెడ్డి సాహెబ్ మీడియాతో మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి మరువ కూడదని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మహబూబ్ పీర్, అనిల్ కుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.

కిశోర్‌కుమార్ రెడ్డి కృషి ఫలితం...

కలికిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాగా మదనపల్లె, రెవెన్యూ డివిజన్‌గా పీలేరు ఏర్పాటులో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి కృషి తగ్గ ఫలితం ఇది, చరిత్రలో నిలిచి పోతుందని టీడీపీ నేతలు ప్రశంసించారు. సింగిల్ విండో కార్యాలయం ఆవరణలో టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. త్రీమెన్ కమిటీ చైర్మన్ నల్లారి చంద్రకుమార్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు కెఎస్ షాబుద్దీన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో కలికిరి మాజీ సర్పంచు నల్లారి లక్ష్మీకర్ రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ మాలతి, డైరెక్టర్ శ్రీనివాస వర్మ, పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రెడ్డివారి యోగేష్ రెడ్డి, ఆస్పత్రి కమిటీ సభ్యుడు లేపాక్షి అస్లామ్, మాజీ ఎంపీపీ నాగభూషణ రెడ్డి, నేతలు నిజాముద్దీన్, రెడ్డెప్ప రెడ్డి, అగస్తి తదితరులు పాల్గొన్నారు.

ఇరు కుటుంబాలకు పరామర్శ



మదనమోహన్‌రెడ్డి కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎంపీ మిథున్ రెడ్డి

పీలేరు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మదనమోహన్‌రెడ్డి, ఉమాకాంత్ రెడ్డి కుటుంబాలను రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి పరామర్శించారు. ఏ అవసరం వచ్చినా అండగా ఉంటూ ఆదుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు. బుధవారం పీలేరుకు వచ్చిన ఎంపీ ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలుకరిస్తూ వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గుమ్మడి కాయలతో దిష్టితీసి స్వాగతం పలికారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, మాజీ జడ్పీచైర్మన్ పెద్దిరెడ్డి, పీలేరు ఎంపీపీ సతీష్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ నేతలు సుంకర చక్రధర్, భానుప్రకాష్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, లోకనాదరెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి, నారే భువనేశ్వర్ రెడ్డి, వీ.పీ. రమేష్‌రెడ్డి, జయరామచంద్రయ్య, రవి, ధార్మనందరెడ్డి, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ ఆధారిత పంటలను సాగుచేయాలి

తంబళ్లపల్లె, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మారుతున్న ఆహారపు అలవాట్లకు తగ్గట్టు డిమాండ్ ఉన్న పంటలను రైతులు పండించాలని ఎంపీడీఓ బాహూజీ పట్నాయక్, పశువైద్య సంచాలకులు సుమిత్ర అన్నారు. వ్యవసాయ, పశు వైద్య శాఖ అధికారులు వేర్వేరుగా కూటమి నేతలతో కలిసి తంబళ్లపల్లె, కన్నెమడుగులో రైతన్న మీకోసం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం, పంటల మార్పిడి, చిరుధాన్యాల సాగు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో నూతన సాంకేతిక పద్ధతులు, ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలను అధికారులు ప్రజలకు వివరించారు. మండల పశువైద్యాధికారి విక్రమ్‌రెడ్డి, వీఏఏ సురేష్, నేతలు, వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఏపీ ఉపాధ్యాయ సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎం. కల్యాణ్ చక్రవర్తి

పెద్దమండ్యం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండల ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) నూతన కార్యవర్గం ఎన్నిక జరిగినట్లు ఆ సంఘం మండల ఆర్థిక కార్యదర్శి చలపతి తెలిపారు. మండల ఏపీయూఎస్ అధ్యక్షుడిగా ఎం.కల్యాణ్ చక్రవర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా సిద్దారెడ్డి, ఉపాధ్యక్షుడిగా గోపాలక్రిష్ణ, కార్యదర్శిగా నవీన్‌కు మార్‌ను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. పీలేరు డివిజన్ అధ్యక్షుడు దండు అమరనాద్, జిల్లా కార్యదర్శి రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

వాల్మీకిపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథంలో బుధవారం శ్రీషిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా ఉదయం ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాల సేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణోత్సవాలు వైభవంగా సాగాయి. ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, అర్చకులు అభిరామ్‌స్వామి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కామాక్షి సమేత సిద్దేశ్వరాలయంలో...

కలకడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కామాక్షి సమేత సిద్దేశ్వరాలయంలో బుధవారం అర్చకులు సుబ్రమణ్యంస్వామి, విజయసారథి ఆధ్వర్యంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. ఉభయదారులుగా మద్దిపట్ల వెంకటరమణనాయుడు, కొండమ్మ దంపతులు వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నిమ్మనపల్లె రోడ్డులో ...

మదనపల్లె అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లె రోడ్డులో వెలసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామి ఆలయంలో పంచమ వార్షికోత్సవం చేశారు. ధర్మకర్తలు రాచపల్లె సుబ్రహ్మణ్యం, అనురాధ స్వామివారి కళ్యాణం కన్నుల పండువలా చేయించారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామి కల్యాణోత్సవం తిలకించారు. భక్తులకు ఆలయంలో అన్నదానం నిర్వహించారు.

మంచాలు, బెడ్లు వితరణ

పీలేరు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మేము సైతం అంటూ టీడీపీ నేతలు పీలేరు 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రికి రూ. లక్ష విలువైన 10 మంచాలు, బెడ్లు, పిల్లోలు, ఇతర సామగ్రిని ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్‌కు అందించారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ కోటపల్లె బాబురెడ్డి మాట్లాడుతూ పీలేరు ఆస్పత్రిలో రోగులకు అందుతున్న మెరుగైన వైద్యం గుర్తించి ప్రభుత్వం ఈ ఆస్పత్రికి కాయకల్ప రాష్ట్ర అవార్డు, స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్రలో భాగంగా జిల్లా స్థాయి బెస్ట్ అవార్డు వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, కోటపల్లె శ్రీనాథరెడ్డి, రౌద్రాల అంకాలమ్మ ఆలయ కమిటీ సభ్యుడు రామక్రిష్ణారెడ్డి, ప్రముఖ కవి వేంపల్లె అబ్దుల్ ఖాదర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు సురేంద్ర, ఏఎంసీ డైరెక్టర్లు జీ. రమాదేవి, కిషోర్‌నాయుడు, కే. రవి, టీడీపీ నేతలు ఆలికా షఫీ, దేవిరెడ్డి వెంకట్రమణారెడ్డి, తెలుగు యువత అధికార ప్రతినిధి స్పోర్ట్స్ మల్లీ, నరేష్‌కుమార్ రెడ్డి, పీలేరు ఈఓ బ్రహ్మానందరెడ్డి, చాన్‌బాష, జయచంద్రారెడ్డి, రెడ్డిముని పాల్గొన్నారు.

ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి

తంబళ్లపల్లె, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా పోలీసు అధికారులు కృషి చేయాలని తంబళ్లపల్లె సివిల్ కోర్టు న్యాయాధికారి ఉమర్‌ఫరూక్ అన్నారు. బుధవారం స్థానిక సివిల్ కోర్టులో తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు, పీటీఎం మండలాల ఎస్‌ఐలు, ఎక్సైజ్ పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఏపీపీ, సీఐ వెంకటేష్, ఎస్‌ఐలు ఉమామహేశ్వరరెడ్డి, హరిహరప్రసాద్ పాల్గొన్నారు.

బసినికొండలో వైభవంగా శివుడి విగ్రహ ప్రతిష్ఠ




బసినికొండలో శివుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

మదనపల్లె అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బసినికొండ శివాలయంలో శివుని విగ్రహాన్ని బుధవారం వైభవంగా ప్రతిష్ఠించారు. పురాతన ఆలయం శిథిలావస్థకు చేరుకోగా కొత్తగా ఆలయం నిర్మాణం చేపట్టారు. ఉదయం నుంచీ ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

వీఆర్వోపై దౌర్జన్యం - కేసు నమోదు

బి.కొత్తకోట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న పాశంవీధి వీఆర్‌ఓ రజనీకాంత్‌పై దౌర్జన్యం చేసిన డేగానిపల్లి వాసి పి.ఆంజనేయరెడ్డిపై కేసు నమోదు చేసినట్టు సీఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలోకి ప్రవేశించి వీఆర్వోను దుర్భాషలాడడం, రెవెన్యూ రికార్డులను లాక్కుని, విధులకు ఆటంకం కలిగించాడంటూ తహసీల్దార్ బావాజాన్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జామియా మసీద్ చైర్మన్ మృతి



మదనపల్లె అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె జామీయా మసీద్ చైర్మన్, విశ్రాంత ఎంఆర్‌ఓ, హాజీ మహమ్మద్ ఖాన్ సాహెబ్ (94) బుధవారం సొసైటీకాలనీలో మృతి చెందాడు. అనారోగ్యంతో ఆయన మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆయన మృతదేహాన్ని మైనార్టీ నేతలు, మసీద్ ఇమామ్‌లు సందర్శించారు.